

నమో నమః

రథసప్తమి సందర్భంగా రాజధాని గ్రామం వెంకటపాలెంలోని వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో స్వామి ఉత్సవ మూర్తుల ఊరేగింపు మంగళవారం కన్నుల పండువగా జరిగింది. భక్తులు గోవింద నామ స్మరణతో ఊరేగింపులో పాల్గొన్నారు.

ప్రభల పనులు ప్రారంభం

- ఊరంతా ఏకమై పోటాపోటీగా నిర్మాణం
- 90 అడుగులకు పైగా ఎత్తులో 20 వరకు కొండకు రాక

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రభల పండుగగా పేరొందిన, కోటప్పకొండ తిరునాళ్లకు భారీ విద్యుత్ ప్రభల నిర్మాణ పనులు గ్రామాల్లో ప్రారంభమయ్యాయి. పల్లెల్లో పోటాపోటీగా ప్రభలను నిర్మిస్తున్నారు. 90 అడుగులకుపైగా ఎత్తులో ప్రభలు రూపుదిద్దుకుంటున్నాయి. తిరునాళ్ళకు 15 నుంచి 20 వరకు భారీ విద్యుత్ ప్రభలు తరలివస్తాయని అంచనా. గ్రామ ప్రతిష్ఠ కోసం అందంగా ప్రభలను నిర్మించడంలో పోటీ ఉంటుంది. ఊరంతా కలసి కట్టుగా ప్రభల పనుల్లో పాల్గొంటు న్నారు. ప్రభల నిర్మాణంలో గ్రామాలకు గ్రామాలు పోటీ పడ తాయి. ఈ ప్రభలలో పోస కుర్చు, మండపాలు, టిక్కీలు, విద్యుత్, బాల ప్రభలు ఉంటాయి. నరసరావుపేట మండలం లోని గురవాయపాలెం, ఉప్పలపాడు, కాకాని, చిలకలూరిపేట నియోజకవర్గం పురుషోత్తపట్నం, యడవల్లి, కోమటినేనివారి పాలెం, అవిశాయపాలెం, కమ్మవారిపాలెం, అప్పాపురం, గోవిందాపురం, మద్దిరాల, కావూరు, బొప్పూడి గ్రామాల్లో భారీ విద్యుత్ ప్రభల నిర్మాణం గ్రామస్థులు చేపట్టారు.



గురవాయపాలెంలో జరుగుతున్న ప్రభ పనులు

కోరం లేక.. వాయిదా

- వైస్‌చైర్మన్ ఎన్నికకు ఐదుగురే హాజరు
- చైర్మన్, రెండో వైస్ చైర్‌పర్సన్ సైతం గైర్హాజరు
- కౌన్సిలర్ల కిడ్నాప్ ఆరోపణలను ఖండించిన పోలీసులు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నిక రెండో రోజు కూడా వాయిదా పడింది. వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి మృతితో సోమవారం ఎన్నికకు అధికారులు ఏర్పాట్లు చేయగా కొంతమంది సభ్యులే హాజరయ్యారు. పైగా సమావేశానికి గంట ముందు వైస్ చైర్మన్ ఎన్నికకు సంబంధించిన పత్రాలను ఎన్నికల అధికారి మురళీకృష్ణకి అందజేయలేదు. దీంతో ఎన్నికను మంగళవారానికి వాయిదా వేశారు. మంగళవారం 11.45 గంటల



వైస్ చైర్మన్ ఎన్నికకు హాజరైన ఐదుగురు కౌన్సిలర్లు

సమయంలో వైసీపీకి చెందిన 18వ వార్డు కౌన్సిలర్ డోగిపర్తి సుజాత, 20వ వార్డు కౌన్సిలర్ కొత్త తులసి సౌజన్య, 21వ వార్డు కౌన్సిలర్ కొత్త పుష్పలత, 28వ వార్డు కౌన్సిలర్ గర్రె నాగేశ్వరరావు, 30వ వార్డు కౌన్సిలర్ వున్నం భారతిలు మాత్రమే హాజరై సంతకాలు చేశారు. చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, 2వ వైస్ చైర్‌పర్సన్ నసీమా హాజరు కాలేదు. మొత్తం 33 మందిలో ఒకరు మృతి చెందగా 32 మంది సభ్యులకు ఐదుగురు మాత్రమే సమావేశానికి హాజరుకావడంతో కోరం సరిపోలేదు. దీంతో వైస్‌చైర్మన్ ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి మురళీకృష్ణ తెలిపారు. తగు నివేదికను ఎన్నికల సంఘానికి తెలియజేస్తామని ప్రత్యేక అధికారి తెలిపారు. వైస్‌చైర్మన్ ఎన్నికకు సంబంధించి టీడీపీ, పోలీసుల నుంచి ఇబ్బంది పెడుతున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని వైసీపీ కౌన్సిలర్లు తెలిపారు. పోలీసుల రక్షణతో స్వచ్ఛందంగా సమావేశానికి హాజరయ్యామన్నారు.

పదవి దక్కడం లేదనే సమావేశానికి దూరం

వైస్‌చైర్మన్ ఎన్నికపై వైసీపీ కౌన్సిలర్ల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. పదవి కోసం ముగ్గురు ప్రయత్నం చేయగా ఆ పార్టీ నేత ఓ మహిళకు హామీ ఇచ్చినట్లు తెలియడంతో మిగిలిన ఇద్దరు సమావేశానికి హాజరుకాలేదు. వైస్‌చైర్మన్ పదవి కోసం ఓ మహిళా కౌన్సిలర్ ప్రయత్నానికి ఆ పార్టీ నేత కూడా సరే అన్నట్టుగా తెలిసింది. పార్టీ కోసం కష్టపడిన తమకే పదవి ఇవ్వాలని జగన్ సామాజికవర్గానికి చెందిన ఓ కౌన్సిలర్ పోటీపడగా మృతిచెందిన వైస్‌చైర్మన్ ఎస్సీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తి కాబట్టి ఆ పదవి అదే సామాజికవర్గానికి ఇవ్వాలని కొంతమంది చేసిన ప్రయత్నం ఫలించలేదు. దీంతో ఆ ముగ్గురి మధ్య వైస్ చైర్మన్ కుర్చీ కోసం పోటీ నెలకొంది. మున్సిపల్ చైర్‌పర్సన్ కొత్త వెంకటసుబ్బారావుతోపాటు మరికొంతమంది కౌన్సిలర్లు మాజీ ఎమ్మెల్యే నిర్వహించిన సమావేశానికి హాజరు కాగా చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు సతీమణి కొత్త పుష్పలత, సమీప బంధువు, మరో కౌన్సిలర్ కొత్త తులసి సౌజన్య, మరో ముగ్గురు మున్సిపల్‌సమావేశానికి హాజరయ్యారు.

పోలీసులు బెదిరించారు

: మాజీ ఎమ్మెల్యే కాసు

వైస్‌చైర్మన్ ఎన్నికకు సంబంధించి కొంత మంది కౌన్సిలర్లను పోలీసులు బెదిరించారని మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి తెలిపారు. 12 మంది కౌన్సిలర్లను కిడ్నాప్ చేయించారని, వారిని విడిచిపెట్టకపోతే పోలీసులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కొంత మంది కౌన్సిలర్లు పొరుగూరు వెళ్లగా కిడ్నాప్ చేశారనే వైసీపీ నేతల ఆరోపణలను అటు పోలీసుశాఖ, ఇటు టీడీపీ వేర్వేరుగా ఖండించింది.

కౌలు రుణాలు.. తీసికట్టు

- వార్షిక పద్దులో ఘనంగా లక్ష్యాలు
- అరకొరగానే బ్యాంకుల నుంచి రుణాలు





- సాకులతో యథావిధిగా సరిపెట్టిన అధికారులు
- సీసీఆర్‌సీ కార్డులున్నా బ్యాంకర్ల నుంచి చిన్నచూపు
- అధిక వడ్డీలతో అప్పుల పాలైన కౌలు రైతులు

కౌలు రైతుల కష్టాలు తీరుస్తాం.. రుణాలు అందిస్తాం.. అప్పుల ఊబి నుంచి గట్టెక్కిస్తాం.. అని అటు అధికారులు, ఇటు పాలకుల హామీలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. ఈ ఏడాది బ్యాంకుల నుంచి కౌలు రైతులకు అందిన రుణాలే ఇందుకు సాక్ష్యాలుగా దర్శనమిస్తున్నాయి. వార్షిక పద్దులో 95 శాతం లక్ష్యాలు సాధించినట్లు అటు అధికారులు, ఇటు బ్యాంకర్లు ప్రకటిస్తున్నాయి. అయితే అందు లో కౌలు రైతుల వాటా చూస్తే తీసికట్టుగా ఉంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తొలినాళ్లలో ప్రకటించిన వార్షిక పద్దులో మెజార్టీ వాటాపై భారీగా ఆశలు పెట్టు కోగా కౌలురైతులకు నిరాశే ఎదురైంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురయ్యామని కూటమి ప్రభుత్వం లో పరిస్థితిలో మార్పు రాలేదనే ఆవేదన కౌలు రైతుల్లో నెలకొంది. రుణాల విషయంలో ఎప్పుడూ చెప్పే సాకులతో అధికారులు సరిపెడుతున్నారు. ప్రభుత్వం మారినా కౌలు రైతుల పరిస్థితిలో మార్పు లేదనడానికి అధికారులు ప్రకటించిన గణాంకాలే సంకేతంగా ఉన్నాయి. అంతిమంగా కౌలు రైతులు అధిక వడ్డీకి అప్పులు తెచ్చి సేద్యం చేసి అప్పుల పాలవుతున్నారు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ప్రకటించిన వేల కోట్ల రుణ పద్దులో కౌలు రైతులను ఉదారంగా ఆదుకుంటామనే హామీలు గుప్పించారు. దీంతో రుణాల విషయంలో తమకు న్యాయం జరుగుతుందని కౌలు రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు. గత ప్రభుత్వంలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా కౌలు రైతులకు ఆర్థిక సంవత్సరంలో అందించిన రుణాలు అంతా కలిపి రూ.50 కోట్లకు మించలేదు. కూటమి ప్రభుత్వంలో అయినా వార్షిక పద్దులో తమ వాటా గణనీయంగా పెరుగుతుందని ఆశించారు. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగియనుండగా వార్షిక రుణ పద్దులో వందశాతం లక్ష్యాలను చేరుకున్నట్లు బ్యాంకులు ఘనంగా ప్రకటిస్తాయి. అయితే వీటిలో కౌలు రైతుల వాటా ఎంతంటే ఈ ఏడాది కూడా బేలచూపులు చూడాల్సిన పరిస్థితే ఉంది. ప్రారంభంలో చెప్పినట్లు రుణాలలో కౌలు రైతులకు కేటాయించిన శాతం మేరకు వారికి ప్రయోజనం చేకూరలేదు.

వేల కోట్ల వార్షిక పద్దు.. అయినా నిరాశే..

ప్రతి ఏడాది ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి వార్షిక రుణ పద్దును అధికారులు ప్రకటిస్తారు. ఇందులో మెజారిటీ వాటా సేద్యానికే దక్కుతుంది. కానీ ఆ రుణ ఫలాలు అందుకోవడంలో కౌలు రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. ఎక్కువ శాతం సర్దుబాటులే తప్ప రైతుల చేతికి వచ్చే రుణాల శాతం బహుస్వల్పం అని గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. బాపట్ల జిల్లాలో వ్యవసాయ అనుబంధ రుణాలకు రూ.10,053 కోట్ల ఇవ్వనున్నట్లు వార్షిక పద్దులో తెలిపారు. ఇందులో పంట రుణాల వాటా రూ.6,321 కోట్లను నిర్దేశించగా ఇప్పటికి రూ.5,800 కోట్లు అందించారు. గుంటూరు జిల్లాలో వ్యవసాయానుబంధ రంగాల వాటాగా రూ.13,613 కోట్లను ప్రకటించగా, పంట రుణాలకు రూ.8,560 కోట్లు కేటాయించారు. పల్నాడు జిల్లాలో రూ.13,210 కోట్లుగా పేర్కొనగా, పంట రుణాలు (మిగతా 6వ పేజీలో)

సీసీఆర్‌సీ కార్డులు ఘనంగా జారీ..

వైసీపీ ఐదేళ్ల పాలనతో పోలిస్తే సీసీఆర్‌సీ(క్రాప్ కల్టివేటర్స్ రైట్ కార్డ్)ల జారీ విషయంలో ఈ ఆర్థిక సంవత్సరంలో పురోగతి ఉంది. గతంతో పోలిస్తే దాదాపు రెట్టింపు కార్డులను కౌలు రైతులకు అందించారు. బాపట్ల జిల్లాలో 1,06,300 సీసీఆర్‌సీ పత్రాలు అందించాలనే లక్ష్యాన్ని నిర్దేశించగా 95 శాతం చేరుకున్నారు. గుంటూరు జిల్లాలో 46,800, పల్నాడు జిల్లాలో 68,000 కార్డులకు 90 శాతం లక్ష్యాలను చేరుకోగలిగారు. ఈ కార్డులు జారీ చేసిన వారి సంఖ్యలో సగం మందికి అయినా రుణాలు అందించాలనే లక్ష్యాన్ని ఆర్థిక సంవత్సరం ఆరంభంలో ప్రభుత్వం పెట్టుకుంది. కానీ ముగింపుకొచ్చేసరికి రుణాలు అందుకున్న వారి గణాంకాలు మరీ దిగదుడుపుగా ఉన్నాయి.



రూ.520 కోట్లకు రూ.100 కోట్లే..

ఈ ఏడాది ఆరంభంలో వార్షిక పద్దు ప్రకటనకు.. ఇప్పటి వరకు కౌలు రైతులకు అందించిన రుణాల గణాంకాలను పరిశీలిస్తే ఎంత తీసికట్టుగా ఉన్నాయో అర్థమవుతుంది. బాపట్ల జిల్లాలో రూ.200 కోట్లు, గుంటూరు జిల్లాలో రూ.170 కోట్లు, పల్నాడు జిల్లాలో రూ.150 కోట్ల రుణాలను కౌలు రైతులకు అందించాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం పెట్టింది. కానీ బాపట్ల జిల్లాలో రూ.40 కోట్లు, గుంటూరు జిల్లాలో రూ.32 కోట్లు, పల్నాడు జిల్లాలో రూ.28 కోట్లకే పరిమితమైంది. ఈ స్వల్ప మొత్తాలలో కూడా ఒక్క సీసీఆర్‌సీ కార్డులే కాకుండా జేఎల్‌జీ, రైతుమిత్ర గ్రూపులు కలిసి ఉండడం కౌలు రైతులపై ఉన్న శీతకన్నుకు అద్దం పడుతోంది.

ఉద్యానవనం.. వెలవెల

- రూ.కోట్ల నిర్మాణాలు శిథిలమవుతున్నా నిర్లక్ష్యం
- పార్కు సంరక్షణను పట్టించుకోని పర్యాటక శాఖ



ఉద్యానవనంలో పెరిగిన కంప చెట్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కోటప్పకొండ దిగువన పచ్చదనంతో కళకళలాడాల్సిన ఉద్యానవనాన్ని పర్యాటక శాఖ పాడుబెట్టింది. పర్యాటకులకు ఆహ్లాదాన్ని అందించాల్సిన పార్కును అధ్వానస్థితి చేర్చారు. నీరు లేక మొక్కలు ఎండి పోయాయి. మొక్కల స్థానంలో కంపచెట్లు పెరిగాయి. పార్కులోని నిర్మాణాలు శిథిలమౌతున్నాయి. కొండకు దిగువన చెరువు పక్కనే టీడీపీ ప్రభుత్వ హయాంలో పర్యాటక శాఖ రూ.2 కోట్లతో అన్ని హంగులతో ఉద్యానవన నిర్మాణం జరిగింది. 2019 జనవరిలో దీనిని ప్రారంభించారు. పూల మొక్కలతో కళకళలాడిన పార్కు నిర్వహణను ఐదేళ్ల వైసీపీ హయాంలో అధికారులు గాలికొదిలేశారు. మొక్కలకు నీరు పోసే పరిస్థితి లేదు. గతంలో ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్టును మూసివేశారు. కొండకు వచ్చే భక్తులు సందర్శించేందుకు ఏర్పాటు చేసిన పార్కు రూపురేఖలు మారిపోవడంతో పర్యాటకశాఖపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2022లో చెరువులో జలవిహారం పేరుతో బోట్ షికార్‌ను ఆర్భాటంగా ప్రారంభించారు. ఆ సమయంలో దాతల నుంచి రూ.5 లక్షలు సేకరించి నిర్మించిన వేదిక కూడా ప్రస్తుతం శిథిలమైంది. చెరువులో బోట్ షికార్‌ను పూర్తిగా నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా పార్కు అభివృద్ధిపై దృష్టి సారించక పోవడంపై భక్తుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది.

నీరు లేని కాళింది మడుగు

ఘాట్ రోడ్డులోని కాళింది మడుగు నిర్వహణను అటవీ శాఖ విస్మరించింది. శ్రీకృష్ణుడి భారీ విగ్రహం ఉన్న కాళింది మడుగులో నీరు పూర్తిగా ఎండి పోయింది. తిరునాళ్ల సమీపిస్తున్నందున మడుగును నీటితో నింపి బోట్ షికార్‌ను అందుబాటు లోకి తెచ్చేందుకు అటవీశాఖ చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

సింగిల్ టెండర్‌తో ఆదాయానికి గండి

త్రికోటేశ్వరుడి దేవస్థానంలో తలనీలాల సేకరణకు రూ.26.26 లక్షలకు టెండర్ ఖరైంది. కాంట్రాక్టర్లతో అధికారులు కుమ్మక్కై టెండర్‌ను తక్కువకు కోట్ చేసినట్లు సమాచారం. సింగిల్ టెండరే దాఖలైనా నిబంధనలు విరుద్ధంగా ఆమోదించారు. తలనీలాల ఆదాయం తగ్గింది. గత ఏడాది కాంట్రాక్టర్లు రింగై టెండర్ దాఖలు చేయడంతో దేవస్థానం ఆదాయాన్ని కోల్పోయింది. ఈ ఏడాది కూడా అదే విధానాన్ని కొనసాగించారన్న విమర్శలున్నాయి. 2023లో తలనీలాల సేకర ణకు రూ44.50 లక్షలకు టెండర్ దాఖలైంది. ఏటేటా ఆదాయం పెరగాల్సి ఉండగా రెండో ఏడాది కూడా కాంట్రాక్టర్లు రింగై దేవస్థానం ఆదా యానికి గండికొట్టారు.



శిథిలావస్థలో పార్కులోని కళావేదిక



నీరు లేని కాళింది మడుగు

డ్వాక్రా ముసుగులో.. టోపీ

- నకిలీ గ్రూపుల పేరిట రుణాలు
- మాజీ చైర్మన్ హస్తంపై ఆరోపణలు
- రుణాలు చెల్లించాలని బ్యాంకుల నుంచి నోటీసులు



మాచర్లటౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేయగా ఆ ముసుగులో నకిలీ సంఘాలతో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని టోపీ పెట్టిన వైనమిది. గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు నకిలీ సంఘాలతో పాటు అప్పటికే ఉన్న సంఘాలకు తెలియకుండా వారి పేరుతో రుణాలను పొందారు. తాజాగా ఆయా సంఘాలకు బ్యాంకుల నుంచి నోటీసులు రావడంతో తాము తీసుకోని రుణాలకు నోటీసులు ఏమిటంటూ మహిళలు బ్యాంకులకు పరుగులు తీయడంతో గత ప్రభుత్వంలో జరిగిన రుణాల కుంభకోణాలు వెలుగుచూశాయి. మాచర్లలోని జీడీసీసీ బ్యాంకులో 2019 నుంచి 2024 వరకు సుమారు 18 నకిలీ గ్రూపుల పేరుతో రూ.1.60 కోట్లు మేర రుణాలు పొందారు. యూనియన్ బ్యాంకులో 41 గ్రూపులకు సుమారు రూ.2.50 కోట్లు, బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 26 గ్రూపులకు సుమారు రూ.1.55 కోట్లు, కెనరా బ్యాంకులో 8 గ్రూపులకు సుమారు రూ.20 లక్షలు రుణాలు పొందారు. ఈ వ్యవహారంలో అప్పటి మున్సిపల్ చైర్మన్ ఒత్తిడితో ఆర్పీలు రుణాలకు ఆమోదం ఇచ్చినట్లు స మాచారం. రుణాలు చెల్లించాల ని డ్వాక్రా గ్రూపుల కు బ్యాంకుల నుంచి నోటీసులు రావడంతో, తాము రు ణాలు తీసుకోకుండా నోటీసులు ఏమిటని, మహిళలు లబో దిబోమంటున్నారు.

ఆర్పీలపై విచారణ చేపడతాం..

అవినీతికి పాల్పడిన ఆర్పీలపై విచారణ జరుపుతాం. అధికారుల నుంచి సమగ్ర నివేదిక రాగానే బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటాం. నగదు రికవరీ చేస్తాం. అవసరమైతే పోలీసులకు ఫిర్యాదు చేస్తాం.

- పోలూరి నరసింహారావు, మున్సిపల్ చైర్మన్

వినుకొండలో.. బీ ట్యాక్సుకు చెల్లు

- భూ ఆక్రమణలకు పాల్పడితే కేసులు నమోదు
- రియల్ వ్యాపారులతో చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): శరవేగంగా అభివృద్ధి చెందుతున్న వినుకొండలో బీ ట్యాక్సుకు చరమగీతం పాడామని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. వినుకొండ రియల్ ఎస్టేట్ వ్యాపారులతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రియల్టర్లు వెంచర్లు వేసుకోవచ్చన్నారు. ఆ వెంచర్లలో తప్పనిసరిగా ఆక్సిజన్ ఇచ్చే మొక్కలను మాత్రమే పెంచాలని సూచించారు. వినుకొండలో పరిశ్రమలు, భూ యజమానులను బెదిరించే రోజులు పోయాయని, ఎవరైనా బెదిరించినట్లు తమ దృష్టికి వస్తే తాట తీసి కింద కూర్చోబెడతామని హెచ్చరించారు. వినుకొండలో దందాలకు కాలం చెల్లించిందన్నారు. వివాదాల్లో ఉన్న భూములు కొనుగోలు చేసి అనవసరంగా సమస్యల్లో ఇరుక్కోవద్దని సూచించారు. భూ ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఎం చంద్రబాబు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని జీవీ ప్రస్తావించారు. స్థిరాస్తి వ్యాపారులు, బిల్డర్ల సమస్యల పరిష్కారానికి తప్పనిసరిగా కృషి చేస్తామన్నారు. వెంచర్లకు అవసరమైన లింకురోడ్ల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రిజిస్ట్రేషన్ విలువ ఎక్కువ ఉందనిపిస్తే లిఖిత పూర్వకంగా తెలియజేస్తే కలెక్టర్ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ల్యాండ్ కన్వర్షన్ త్వరితగతిన చేసే విధంగా రెవెన్యూ అధికారులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. అన్నీ సక్రమంగా ఉన్నా అధికారులు లంచం అడిగితే ఉపేక్షించేది లేదన్నారు. ఎవరైనా తన పేరు చెప్పి అవినీతికి పాల్పడితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని రియల్టర్లు, బిల్డర్లకు సూచించారు.



వ్యాపారులనుద్దేశించి మాట్లాడుతున్న జీవీ

దాచేపల్లి, గురజాల
పంచాయతీలకు పోస్టుల మంజూరు

గుంటూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి, గురజాల నగర పంచాయతీలకు శాశ్వత పోస్టులను మంజూరు చేస్తూ మునిసిపల్ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్ సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. పూర్వ దాచేపల్లి గ్రామ పంచాయతీ నుంచి పంచాయతీ సెక్రె టరీ గ్రేడ్-2, 3, జూనియర్ అసిస్టెంట్, బిల్ కలెక్టర్, స్వీపర్ పోస్టులను రీడిజిగ్నేషన్‌పై అప్‌గ్రేడ్ చేశారు. పంచాయతీ సెక్రెటరీ గ్రేడ్-2 పోస్టుని కమిషనర్‌గా, గ్రేడ్-3 పోస్టుని మేనేజర్‌గా, జూనియర్ అసిస్టెంట్ (నడికుడి)ని యూడీ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా రీడిజిగ్నేట్ చేశారు. బిల్ కలెక్టర్, స్వీపర్ పోస్టులను యథాతథంగా ఉంచారు.

జూనియర్ అసిస్టెంట్(దాచేపల్లి)ని అదే పేస్కేల్‌లో రిటైన్ చేశారు. ఈ విధంగా దాచేపల్లి నగర పంచాయతీలో 12 పోస్టులను రీడిజిగ్నేట్ చేశారు. గుర జాల నగర పంచాయతీలో గ్రేడ్-2 పంచాయతీ సెక్రెటరీని కమిషనర్‌గా, గ్రేడ్-4 సెక్రెటరీని మేనేజర్‌గా అప్‌గ్రేడ్ చేశారు. జూనియర్ అసి స్టెంట్(గురజాల)ని అదే పేస్కేల్‌పై జేఏఈగా రిటైన్ చేశారు. మరో జేఏని యూడీ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా అప్‌గ్రేడ్ చేశారు. బిల్ కలెక్టర్‌ని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా అప్‌గ్రేడ్ చేశారు. స్వీపర్, నైట్‌వాచ్ మెన్‌లను అదే పేస్కేల్‌పై రిటైన్ చేశారు. ఈ విధంగా మొత్తం 10 పోస్టులను గురజాల నగర పంచాయతీకి మంజూరు చేశారు.

రైతు ఆత్మహత్యాయత్నం

పిడుగురాళ్ల ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) కుటుంబ వివాదంలో నడుస్తున్న నిషేధిత భూమిని ఆన్‌లైన్‌లో చేర్చాలని కోరుతూ అధికారుల చుట్టూ తిరుగుతున్న ఓ రైతు రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన మంగళ వారం జరిగింది. రాజుపాలెం మండలం కోటనెమలిపురికి చెందిన రమణారెడ్డి, పెద్దిరెడ్డి సమీప బంధువులు. పిడుగురాళ్ల మండలం కోనంకి పరిధిలో కొంత నిషేధిత భూమి ఉంది. ఆ భూమిని ఆన్‌లైన్ చేయాలని ఒకరు, ఉన్న పేరును తీసివేయాలని ,మరొకరి మధ్య కొన్నేళ్లుగా పోలీస్ స్టేషన్‌లో కేసులు ఉన్నాయి. పెద్ద మనుషుల సమక్షంలో ఈ వివాదం కొనసాగుతోంది.

ఈ నేపథ్యంలో రమణారెడ్డి మంగళవారం మద్యం తాగి పిడుగురాళ్ల రెవెన్యూ కార్యాలయం ఎదుట ఒంటిపై పెట్రోల్ పోసుకునేందుకు యత్నించాడు. ఈ లోగా అక్కడున్న సిబ్బంది, మరికొందరు రమణా రెడ్డిని అడ్డుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి పిడుగురాళ్ల తహసీల్దారు మధు బాబు వివరణ ఇస్తూ, ఆ భూమికి సంబంధించి కుటుంబ సమీప బంధువుల మధ్య వివాదం జరుగుతోందని చెప్పారు. అది నిషేధిత భూమి జాబితాలో ఉండటం వలన ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఇప్పుడు ఏమీ చేయడం సాధ్యం కాదని తెలిపారు.

రూ.16.95 లక్షల విలువైన 17 బైకులు స్వాధీనం

- ముగ్గురు ద్విచక్ర వాహన చోరుల అరెస్టు
- నిందితుల్లో వినుకొండకు చెందిన మహిళ
- అడిషనల్ ఎస్పీ ఏటీవీ రవికుమార్

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పరి సర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను అపహరిస్తున్న ముఠాను మంగళ గిరి పట్టణ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. మంగళగిరి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఏటీవీ రవికుమార్ నిందితుల వివరాలు వెల్లడించారు. గుంటూరులోని గుజ్జనగుండ్ల సెంటరుకు చెందిన నిసనం సతీశ్, స్వర్ణభారతినగర్‌కు చెందిన పేర్ల వినోద్, విను కొండ ఫైర్‌స్టేషన్ బజారుకు చెందిన షేక్ గౌస్యలు ముఠాగా ఏర్ప డ్డారు. మంగళగిరి పట్టణం, మండలం, తాడేపల్లి, విజయవాడ పరి సర ప్రాంతాల్లో సంచరిస్తూ ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్నారు. గౌస్య ప్రస్తుతం సతీశ్‌తో సహజీవనం చేస్తూ బైకు చోరీలకు పాల్పడు తోంది. సతీశ్, గౌస్యలు ఒక మోటారు సైకిల్‌పై వచ్చి అర్ధరాత్రి దాటిన తరువాత తమ వాహనాన్ని ఓ చోట నిలిపి వుంచి చోరీ చేయదలచుకున్న మోటార్ సైకిల్‌ను మారు తాళం ద్వారా స్టార్ట్ చేసి ఉడాయిస్తుంటారు. మర్నాడు వచ్చి ఎవరికీ అనుమానం రాకుండా తమ వాహనాన్ని తీసుకు వెళుతుంటారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరి జ్ఞానం సహకారంతో మంగళవారం ఉదయం ముగ్గురు నిందితులు కాజ టోల్ ప్లాజా సమీపంలో వున్నట్టు గుర్తించి అదుపులోకి తీసు కున్నారు. నిందితులను విచారణ చేయగా గుంటూరు జిల్లా పరి ధిలో 16 బైకులు, విజయవాడ కృష్ణలంక ప్రాంతంలో ఒక బైకు దొంగిలించి నట్టు తేలింది. స్వాధీనం చేసుకున్న బైకుల విలువ సుమారు రూ.16 లక్షల 95 వేలు వుంటుందని చెప్పారు. ద్విచక్ర వాహనదారులు హ్యాండిల్ లాక్‌తోపాటు వీల్ లాక్



అరెస్టు చేసిన నిందితులు, స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలతో ఏఎస్పీ రవికుమార్, డీఎస్పీ మురళీకృష్ణ

కూడా వేసు కోవాలని, సాధ్యమైనంత వరకు సీసీ కెమెరాల పర్యవేక్షణలో వాహ నాలను పార్కింగ్ చేయాలని, వీలైతే బైకులకు జీపీఎస్ పరికరాన్ని అమర్చుకోవాలని రవికుమార్ సూచించారు. మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని, తాడేపల్లిలో ఇప్పటికే కార్డెన్ సెర్చ్ నిర్వహించామని, మంగళగిరిలో కూడా గంజాయి ప్రభావిత ప్రాంతాల్లో నిర్వహిస్తామని వెల్లడిం చారు. నిందితులు నేర ప్రవృత్తిని వీడకుంటే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం గుంటూరు జిల్లాలో మొత్తం 19 మందిపైన, మంగళగిరిలో ఇద్దరిపైన పీడీ యాక్టులు నమోదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో నార్త్ సబ్‌డివిజన్ డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ, పట్టణ, రూరల్ సీఐలు డి.వినోద్ కుమార్, వై.శ్రీనివాస రావు, పట్టణ ఎస్ఐ బి.రవీంద్ర నాయక్ పాల్గొన్నారు.



గుంటూరులోని రైల్ వికాస్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్ఎం రామకృష్ణ, ఏడీఆర్ఎం, సీనియర్ డీఈఈ తదితరులు

ఏడాది ఆఖరుకు వంద శాతం రైలుమార్గాల విద్యుదీకరణ

- డీఆర్ఎం ఎం రామకృష్ణ

గుంటూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో 96 శాతం రైలు మార్గాల విద్యుదీకరణ పూర్తి అయిందని, ఈ సంవత్సరం ఆఖరుకు 100 శాతం పూర్తి చేస్తామని డీఆర్ఎం ఎం రామకృష్ణ అన్నారు. భారతీయ రైల్వేలో ఎలక్ట్రిక్ ట్రాక్షన్ అమలులోకి వచ్చి మంగళవారం నాటికి వందేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ 1925 ఫిబ్రవరి నెల 3 న తొలి ఎలక్ట్రిక్ లోకో రైలు బొంబాయి నుంచి కుర్లా వరకు నడిచిందన్నారు. ఈ నేప థ్యంలో దేశ వ్యాప్తంగా ఎలక్ట్రిక్ ట్రాక్షన్‌ను స్మరించుకొంటూ కార్యక్రమాలను రైల్వే శాఖ నిర్వహిస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా స్థానిక నల్లపాడులోని కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు, 150 మంది రైల్వే సిబ్బందితో వాకథాన్ మంగళవారం ఉదయం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం సైమన్, గతిశక్తి సీపీఎం మనోహర్‌రెడ్డి, సీనియర్ డీఈఈ (ట్రాక్షన్) పీ రవితేజ, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, డీసీఎం కమలాకర్‌బాబు పాల్గొన్నారు.

బాపట్ల ఫార్మసీ కళాశాల బృందానికి
ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీ పేటెంట్ గ్రాంట్



గ్రాంట్ పొందిన అధ్యాపకురాలు సుకన్య

బాపట్లరూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బాపట్ల కాలేజీ ఆఫ్ ఫార్మసీ కళాశాల అధ్యాపకురాలు మానం సుకన్య, వారి పరిశోధన బృందం ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీ పేటెంట్ గ్రాంట్ పొందారని ప్రిన్సిపాల్ డాక్టర్ టిఇజికె. మూర్తి తెలిపారు. 'లిపోసోమల్ ఫార్ములేషన్ యూసింగ్ లిపోయిక్ యాసిడ్ ఫర్ టార్గెటెడ్ డెలివరి ఆఫ్ యాంటీఆక్సిడాంట్స్' అనే అంశానికి సంబంధించి జర్మన్ పేటెంట్ గ్రాంట్ లభించినందుకు ఆమెకు అభినందనలు తెలిపారు. సుకన్య మాట్లాడుతూ తన పీహెచ్‌డీ గైడ్ విద్యాధార, ప్రిన్సిపాల్ గోపాలకృష్ణమూర్తి విలువైన సలహాలు, సూచనలు,ప్రోత్సాహంతో పరిశోధనలలో మెరుగ్గా రాణించగలుగుతున్నట్లు చెప్పారు.

తన పరిశోధనలలో భాగంగా ఇటీవల వీవీఐపీఎస్, గుడ్లవల్లేరు కాలేజీలో జరిగిన జాతీయ స్థాయి కాన్ఫరెన్స్‌లో 'ఇంపాక్ట్ ఆఫ్ ఫెనుగ్రీక్ ఆయిల్ ఆన్ సిటాగ్లిప్టిన్ ఫార్మాకోకినేటిక్ అండ్ ఫార్మాకోడైనమిక్ ప్రొఫైల్-ఎ కంప్యూటేషనల్ డాకింగ్ స్టడీ-2 కో-రిలేట్ బ్లడ్ గ్లూకోజ్ లెవెల్' అనే అంశంపై ఓరల్ ప్రజంటేషన్ విభాగంలో ద్వితీయ బహుమతి పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, సెక్రటరి మానం నాగేశ్వర రావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.



విద్యార్థిని ఆర్ కళా జ్యోత్స్నను అభినందిస్తున్న విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, సీఈవో మేఘన, వైస్‌చాన్సలర్ నాగభూషణ్ తదితరులు

'విజ్ఞాన్' విద్యార్థినికి తైక్వాండోలో బంగారు పతకం

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 4 (ఆంధ్ర జ్యోతి) : చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థినికి తైక్వాండోలో జాతీయ స్థాయి బంగారు పతకం సాధించిందని వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. వైస్ చాన్సలర్ మాట్లాడుతూ తమ యూనివర్సిటీలో రెండో సంవత్స రం సీఎస్ఈ చదువుతున్న విద్యార్థిని ఆర్ కళాజ్యోత్స్న ఈ పతకం సాధించినట్లు చెప్పారు. తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో తెలంగాణ స్టేట్ తైక్వాండో అసోసి యేషన్ హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన 40వ జాతీయ సీనియర్ తైక్వాండో చాంపియన్‌షిప్ 2024-25లో ఆమె పాల్గొన్నట్లు తెలిపారు. ఫైనల్లో కర్ణాటక రాష్ట్రం తరఫున పాల్గొన్న విద్యార్థినిపై మొదటి రౌండ్‌లో బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాజ్యోత్స్నను విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ అభినందించారు.

ఆరోగ్య సిబ్బందికి పాప్‌స్మియర్, మెమోగ్రామ్ పరీక్షలు

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కేన్సర్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం కేన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఒమేగా కేన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కేన్సర్ స్క్రీ నింగ్ శిబిరం జరిగింది. డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ స్క్రీనింగ్ శిబిరంలో ఒమేగా హాస్పిటల్‌కు చెందిన సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఎంజీ నాగ కిషోర్, రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ పీ గీతా రుక్మిణి, ఇతర అంకాలజీ వైద్య నిపుణులు నోటి కేన్సర్, రొమ్ము కేన్సర్, గర్భాశయ ముఖ ద్వార కేన్సర్ పరీక్షలు జరిపారు. 52 మంది మహిళలకు పాప్‌స్మియర్ పరీక్షలు, 35 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించారు.

ప్రభుత్వాస్పత్రిలో అగాహన ర్యాలీ..

వరల్డ్ కేన్సర్ డే పురస్కరించుకొని గుంటూరు వైద్యకళాశాల నాట్కో కేన్సర్ సెంటర్ నుంచి నగరంలో మంగళవారం వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ప్రభుత్వాస్పత్రి కేన్సర్ వైద్యులతో పాటు చలపతి ఫార్మసీ కళాశాల విద్యార్థులు నగర ప్రధాన కూడళ్లల్లో ర్యాలీ నిర్వహించారు. కేన్సర్‌పై అవగాహన కల్పించేలా విద్యార్థులు ప్లకార్డులను ప్రదర్శించారు. అనంతరం శుశ్రుతహాల్‌లో నర్సింగ్ సిబ్బందికి కేన్సర్ అవగాహన సదస్సు నిర్వహించారు. 'కేన్సర్‌ను అరికడదాం' అనే నినాదంతో గుంటూరు వైద్యకళాశాలకు చెందిన 500 మంది వైద్య విద్యార్థులు మంగళవారం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జీఎంసీ నుంచి ప్రారంభమైన ర్యాలీ జిల్లా కోర్టు, మీదుగా మున్సిపల్ ట్రావెలర్స్ బంగ్లా సెంటర్‌కు చేరుకుంది.

కౌలు రుణాలు..తీసికట్టు

(5వ పేజీ తరువాయి)

రూ.8,306 కోట్లు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ లక్ష్యాలలో ఇప్పటికే 90 శాతం చేరుకున్నట్లు బ్యాంకర్లు చెబుతున్నారు. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగియబోతున్నందున అప్పటికి వంద శాతం లక్ష్యాలను చేరుకుంటామనే ధీమాను బ్యాంకర్లు వ్యక్తం చేస్తున్నాయి. ఇన్ని వేల కోట్ల పద్దులో కౌలు రైతులకు దక్కిన వాటా పరిశీలిస్తే విస్తుపోవాల్సిందే.

ప్రణాళికా లోపం.. నిబంధనల శాపం

సీసీఆర్‌సీ కార్డుల కాల వ్యవధి పదకొండు నెలలే. వీటి జారీని మే నుంచి ఏప్రిల్ వరకు మాత్రమే ఇస్తారు. ఇవి కౌలు రైతులకు అందేసరికే జూలై, ఆగస్టు నెలలు వస్తున్నాయి. అప్పటికే ఇచ్చిన వ్యవధిలో రెండు నెలలు గడిచిపోతుంది. బ్యాంకర్లు పెట్టే నిబంధనలకు అటువైపు కన్నెత్తి చూడాలంటేనే రైతులు భయపడాల్సిన పరిస్థితి. ఇక భూ యజమానులకు అవగాహన లేక కౌలు చేసుకునే రైతులకు రుణాలు అందించడానికి సుముఖత వ్యక్తం చేయడంలేదు. పైగా వారే రుణాలు తీసుకోవడం కూడా కౌలు రైతులకు ప్రతిబంధకంగా మారుతోంది. ఇదేకాకుండా ఏటికేడు కౌలు చేసుకునే రైతులు మారుతుండడంతో వారు కట్టకపోతే ఆ మొత్తం తమ నెత్తిన పడుతుందనే భయంతో యజమానులు వెనుకంజ వేస్తున్నారు.

ఇవేకాకుండా అధి కారుల వైపు నుంచి రైతులను ఆదుకోవాలనే చిత్తశుద్ధి కొరవడింది. ఆర్థిక సంవత్సరం ముగింపులో హడావిడిగా భూ యజమానులకు అవ గాహన సదస్సులు నిర్వహించడం లాంటి మొక్కుబడి కార్యక్రమాలతో సరిపెడుతున్నారు. నిజానికి సేద్యం రుణ పద్దులో పదిశాతం కౌలు రైతుల వాటాగా ఉండాలనే డిమాండ్‌ను రైతు సంఘాలు ఎప్పటి నుంచో చేస్తున్నాయి. కానీ ప్రసుతం తీసికట్టుగా నిర్దేశించుకున్న పదుల కోట్ల రుణాలే రైతుల చెంతకు చేరని దయనీయ పరిస్థితి కనబడుతోంది. ఇక పదిశాతం వాటా ఎప్పటికి దక్కేను అని కౌలు రైతులు వాపోతున్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు

టీడీపీ స్థలం ఆక్రమణ కేసులో నిందితుల అరెస్టు

బాపట్ల,ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ కార్యాలయ నిర్మాణం కోసం రిజిస్ట్రేషన్ చేసిన స్థలాన్ని నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసిన ఘటనలో నిందితులను బాపట్ల పట్టణ పోలీసులు అరెస్టు చేశారు.బాపట్ల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ రామాంజనేయులు మంగళవారం విలే కరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేసు వివరాలు వెల్లడించారు. డీఎస్పీ మాట్లాడుతూ పట్టణంలోని శ్రీనివాస్‌నగర్‌లో సర్వే నంబరు 969-1లో 9 1/2 సెంట్ల స్థలంలో టీడీపీ కార్యాలయ నిర్మాణం కోసం తెలుగుదేశంపార్టీ అభిమాని మువ్వా సుబ్బారావు తనయుడు హరీష్ విరాళంగా నారా చంద్రబాబునాయుడు పేరుతో 2000 సంవత్సరంలో రిజిస్ట్రేషన్ చేశారన్నారు. అయితే, 2010 సంవత్సరంలో ఆ భూమిని బాపట్ల పట్టణం వెంగళ్‌విహార్‌కు చెందిన మార్పు నిర్మలాదేవి ఆమె కుమారుడు మార్పు సతీష్‌కు నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేశారన్నారు. ఈ విషయంలో అప్పటి తహసీల్దార్ సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. కొంతకాలం తర్వాత మళ్లీ నకిలీ పత్రాలను ఒరిజనల్ పత్రాలుగా చూపించి పలు దఫాలుగా 7సార్లు అక్రమ రిజిస్ట్రేషన్ చేసినట్లు చెప్పారు. ఈ విషయంపై తెలుగుదేశంపార్టీ పట్టణాధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నకిలీ పత్రాలతో అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన 9 మందిని గుర్తించామన్నారు. వీరిలో కారుమూరి సత్యవేదం, బుడ్డి శ్రీనివాసరావు, నక్కల శ్రీనివాసులు, నక్కల లలిత, కోట శివారెడ్డి, ఉప్పాల కోటేశ్వరరావు, నక్కల సత్తార్‌రెడ్డి, నందనం నరసింహారావులను అరెస్టు చేసినట్లు చెప్పారు. నిందితుల ఉన్న అక్రమ రిజిస్ట్రేషన్ పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమంగా భూములు స్వాధీనం చేసుకుంటే చర్యలు తప్పవని, స్థలం విషయాలలో ఎవరైనా భయపెడుతుంటే పోలీసులను సంప్రదిస్తే, విచారణ చేసి న్యాయం చేస్తామని తెలిపారు. సమావేశంలో పట్టణ ఎస్ఐలు విజయ్‌కుమార్, చంద్రావతి పాల్గొన్నారు.



పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్ బాబు, మ్యానీ, శామ్యూల్ కిరణ్ తదితరులు. ఇన్‌సెట్‌లో ప్రమీల సెల్వరాజ్ (ఫైల్)

బైబిల్ మిషన్ స్త్రీల సభల కన్వీనర్ ప్రమీలా సెల్వరాజ్ మృతి

పెదకాకాని, ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి): బైబిల్ మిషన్ స్త్రీల సభల కన్వీనర్, రెండో శనివారం ఉపవాస ప్రార్థన నిర్వాహకురాలు డాక్టర్ జె. ప్రమీలా సెల్వరాజ్ మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడు తున్న ఆమె, గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో సోమవారం ఆమె తుదిశ్వాస విడిచారు. భక్తుల సందర్శనార్థం ప్రమీలాసెల్వరాజ్ పార్థివ దేహాన్ని కాకాని స్వస్థతశాలకు తర లించారు. మంగళవారం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అధికసంఖ్యలో ప్రముఖులు, సేవకులు, భక్తులు హాజరై నివాళులర్పించారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దిరాల ఇమ్మానుయేలు నివాళులర్పించారు. ఆమె కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ నెల 7న ఉదయం 10 గంటలకు ప్రమీలా సెల్వరాజ్ జ్ఞాపకార్థ కూటమి జరుగుతుందని బైబిల్ మిషన్ అధికారులు తెలిపారు. ప్రతి ఒక్కరూ పాల్గొనాల్సిందిగా కోరారు.

'అమరావతిని అడ్డుకోవడమే లక్ష్యంగా సాగిన జగన్ పాలన'

గుంటూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్లలో అమరావతి అభివృద్ధిని అడ్డు కోవడమే లక్ష్యంగా జగన్ పాలన సాగిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కు మార్ విమర్శించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాభివృద్ధి పూర్తిగా కుంటుపడిం దని, మూడు రాజధానుల పేరుతో అమరావతి రాజధాని నిర్మాణ పనులను నిలిపివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి మునిగిపోతుందని అసత్యమైన ప్రచారాలు చేశారని, అమరావతి అడవిని తలపిస్తుందని, శ్మశానం అంటూ కూడా ఇష్టారీతిన మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాలు, వరదలకు అమరావతి పక్కన ఉన్న విజయవాడ బుడ మేరు పొంగింది. ముంబై, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ నగరాలు మునిగిపోయాయి కానీ అమరావతిలో చిన్న నష్టం కూడా జరగలేదని చెప్పారు. అమరావతి నిర్మాణం జరగ కుండా అడ్డుకోవడమే జగన్ లక్ష్యంగా ఐదేళ్ల పాలన కొనసాగిందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతి నిధి దామచర్ల శ్రీనివాసరావు, కంచర్ల శివరామయ్య, బొబ్బిలి రామారావు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 4 (ఆంధ్ర జ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 549.30 అడుగులు ఉంది. ఇది 208.23 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9833 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7353 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 20,384 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2200, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 40,050 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 29,874 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్


బ్రాయిలర్ బర్డ్	123,132,142
చికెన్ విత్ స్కిన్	230.00
చికెన్ స్కిన్ లెస్	240.00

1,13,256 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,17, 126 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1, 13,256 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 77,914 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	9000	13800	334	--	--
నెంబరు. 5	11000	12500	నెంబరు.5	--	--
273	10700	11000	273	--	--
341	10000	15500	341	--	--
4884	9700	12000	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	13800	తేజ	10500	11000
బ్యాడిగి	10000	12500	బ్యాడిగి	10000	12000
దేవనూరు డీలక్స్	10000	12500	దేవనూరు డీలక్స్	--	--
తెల్లకాయలు	--	--	తెల్లకాయలు	--	--

అమృతమూర్తికి అశ్రుతాంజలి



కీ॥శే॥ శ్రీ వట్టికుంట దేవేంద్రయ్య గారు

మాజీ చైర్మన్ : శ్రీ కోదండరామ ఎత్తిపోతల పథకం, ధరణికోట
ధరణికోట గ్రామం, అమరావతి మండలం, పల్నాడు జిల్లా

జననం : 10-02-1941

మరణం : 26-01-2025

మంచికి మారుపేరుగా నిలిచి, ప్రేమ ఆప్యాయతలతో మమ్ములను పెంచి,
కుటుంబ ఉన్నతికి అహర్నిశలు శ్రమించి, మా ఉన్నతికి కారకులైన మీరు
మా నుండి దూరమైననూ మా హృదయాలలో ఎల్లప్పుడూ చిరస్థాయిగా నిలిచి ఉంటారు.
మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ....
మీకివే మా ఘన నివాళులు అర్పిస్తూ....

భార్య :
వట్టికుంట సామ్రాజ్యం (లేటు)

కుమారులు - కోడళ్ళు :
వట్టికుంట పెదనరసింహారావు - లింగమ్మ
వట్టికుంట పూర్ణచంద్రరావు (లేటు) - విజయకుమారి (లేటు)
వట్టికుంట నరసింహారావు - నాగసత్యకుమారి (బుజ్జి)

కుమార్తె - అల్లుడు :
వడ్లమూడి లక్ష్మీనరసమ్మ - కృష్ణారావు

మనవళ్ళు - మనుమరాళ్ళు :
వట్టికుంట శేషగిరిరావు - లీన్ MBA
(ABeam Consulting Singapore, Dubai)
డా॥ వట్టికుంట నరేష్ MDS - డా॥ ఖ్యాతి BDS
డా॥ వట్టికుంట నరసింహారావు MD, USA - డా॥ లహరి MDS, USA
వట్టికుంట విజయభానుతేజ B.Tech - శ్రవంతి B.Tech
డా॥ వడ్లమూడి శ్రీనివాసరావు MBBS - డా॥ మాధవి BDS
Ex. NTR వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్
డా॥ వడ్లమూడి రాంబాబు MD (A&E), Dubai - డా॥ సీతామహాలక్ష్మి MD (Path), Dubai
డా॥ మంచికలపూడి వెంకటకృష్ణ MD (Paed), IFPCCM - డా॥ లక్ష్మీ మౌనిక MD (Gen)

ముదిమనవళ్ళు : యదిద్య, వివేక్, అర్జున్, అభిషేక్, రామ్ నిర్విక్, సిద్ధార్థ్,
ముదిమనవరాళ్ళు : అక్షయ, ప్రసన్న, ధనశ్రీ, అన్షి, మహిమ, మాన్య, రుషిక, నవేష, కియాన్న

పెద్దకర్మ : ది. 05-02-2025 బుధవారం మధ్యాహ్నం 12.00 గంటలకు పల్నాడు జిల్లా, అమరావతి మండలం, ధరణికోట గ్రామంలోని మా స్వగృహం నందు పెద్దకర్మ జరుగును. కావున తెలియపరచటమైనది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 34.20 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పవర్ జనరేషన్ ద్వారా మూడు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నట్లు రాజు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై నేడు టీడీపీ నేతల సమావేశం

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండల కేంద్రమైన అమరావతి లోని ఏవీఆర్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం సాయంత్రం 3 గంటలకు టీడీపీ నేతలతో సమావేశం జరగనుందని టీడీపీ మండల నాయకుడు మల్లాది విష్ణు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవి, ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ హాజరుకానున్నారని తెలిపారు.

శాకాహార ర్యాలీ

దుర్గి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన దుర్గిలో శ్రీమహర్షి కల్పతరువు ధ్యాన మందిరం ఆధ్వర్యాన మంగళవారం శాకాహార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన మందిరం సభ్యుడు జే సతీష్‌బాబు మాట్లాడుతూ మూగజీవాలను ప్రేమించు.. శాకాహార్ని భుజించి అన్న నినాదంతో ప్రజలకు శాకాహారం ఆవశ్యకతను వివరిస్తున్నామన్నారు. ర్యాలీలో నాగమణి, తులసి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మహిళ మృతి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణ తెలుగు మహిళ నాయకురాలు బీ మాధురి(55) మంగళవారం గుండె పోటుతో మృతి చెందారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఆమె పార్టీలో పని చేస్తూ వచ్చారు. మాధురి మరణ వార్త తెలుసుకున్న పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఆలయంలో అన్నదానం

గురజాలటౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతపాటేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళవారం స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యాన అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ కమిషనర్ శివన్నారాయణ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు గుండా కాశీవిశ్వనాథం, రమణశుక్లా, బండి రవి, కే.హనుమంతురావు పాల్గొన్నారు.

వీఆర్వోల సంఘం అధ్యక్షుడిగా
మల్లికార్జునరెడ్డి

వెల్దుర్తి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోల సంఘం మండల అధ్యక్షుడిగా బీ మల్లికార్జునరెడ్డి ఎన్నికయ్యారు. వెల్దుర్తి సచివాలయంలో మంగళవారం వీఆర్వోల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా జీ.శ్రీనివాసరావు, ఎస్ కొండలరావు, సంయుక్త కార్యదర్శిగా కే. శ్రీనివాసరావు, కోశాధికారిగా ఈ. దుర్గాభవానిలు ఎన్నికయ్యారు.

అంధకారంలో రాజానగర్

దుర్గి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజానగర్ గ్రామంలో వీధి లైట్లు లేక రాత్రయితే అంధకారం అలుముకుంటోంది. ఎన్నో యేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ నేతలు, అధికారులు పట్టించుకున్నది లేదు. ఈ గ్రామం అటవీ ప్రాంతంకు దగ్గరలో ఉండటంతో రాత్రయితే గ్రామస్థులు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. నేతలు, అధికారులు స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

దుర్గి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈనెల 7న నిర్వహించనున్న లక్ష డప్పులు వేల గొంతుకలు కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్ నేతలు మంగళవారం మండల కేంద్రమైన దుర్గిలో విడుదల చేశారు. మాదిగలు వేలాదిగా తరలివచ్చి కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందుకూరి రమేష్, రాయపాటి కిషోర్, చాట్ల దీనమ్మ, రాయపాటి మాణిక్యరావు, బొల్లెద్దుల బుల్లి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

మాచర్లరూరల్, ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్ బాలయోగి గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు మంగళవారం గ్రామంలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మేరీ మంజుల మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని, క్యాన్సర్‌ను నయం చేసే వైద్యం అందుబాటులో ఉందని, ఎవరూ భయపడవద్దని అన్నారు.

ఏరియా ఆస్పత్రిలో అన్నదానం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : డొక్కా సీతమ్మ అన్న ప్రసాద వితరణ పథకంలో భాగంగా జనసేన నాయకులు అప్పాపురపు నరేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం 110 మంది పేదలకు ఏరియా వైద్యశాలలో అన్నదానం చేశారు. తన తాత, నాయనమ్మల పేరిట అన్నదానం చేసినట్టు నరేంద్ర తెలిపారు. కార్యక్రమంలో కే శంకరరావు, పీ రామకోటేశ్వరరావు, నరసింహారావు, డీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను వ్యతిరేకించాలి

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఏపీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కానూరి కృష్ణకుమారి తెలిపారు. మంగళవారం పట్టణంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నియంత్రణపై అవగాహన సదస్సు జరిగింది. సమావేశంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షురాలు నూర్జహాన్, ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు కరిముల్లా, ప్రిన్సిపాల్ వనజ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో రథ సప్తమి వేడుకలు



వేదపాఠశాలలో వేదపఠనం చేస్తున్న విద్యార్థులు

- అమరావతి అమరేశ్వరాలయంలో సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు
- దాచేపల్లి శ్రీరంగనాథుడి ఆలయంలో స్వామి వారికి గ్రామోత్సవం

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) రథ సప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలో మంగళవారం భక్తులు సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయాకార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. మండల పరిధిలోని ఎండ్రాయి గ్రామంలోని శివాలయంలో వేద పాఠశాల విద్యార్థులు సూర్యనమస్కారాలు, హోమం నిర్వహించి స్వామివార్లకు పూజలు నిర్వహించారు. దీంతో పాటు ఆలయంలో పార్వతీదేవికి నిర్వహిస్తున్న శ్యామల నవరాత్రుల ఉత్సవాలు కొనసాగాయి. వేదపాఠశాల నిర్వాహకులు ఆలయ అర్చకులు ఘంటసాల చంద్రమౌళి, మణికంఠలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

దాచేపల్లి, (ఆంధ్రజ్యోతి) : పర్వదినాలకు నెలవైన మాఘ మాసంలో రథ సప్తమిని పురస్కరించుకొని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ రంగనాధుని ఆలయంలో రథ సప్తమి వేడుకలు నిర్వహించారు. మంగళవారం గ్రామంలోని శ్రీ రంగ నాథస్వామి దేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు క్రోసూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన రథ సప్తమి వేడుక లకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పల్లాప్రోలు అనురాధ ఆధ్వర్యంలో జరిగిన స్వామి వారి భక్తిగీతాల ఆలాపనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వందల సంవత్సరాల నుంచి ఆలయంలో ఆనవాయితీగా జరుగుతున్న రథోత్సవ వేడుకలతో స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు. మహిళా భక్తులు స్వామి వారి ఊరేగింపు పల్లకిని మోశారు. అనంతరం ఆవు పిడకలతో తయారుచేసిన నైవేద్యాన్ని భక్తులకు పంపిణీ చేశారు. వేద మంత్రాల మధ్య జరిగిన కార్యక్రమానికి తిలకించేందుకు పట్టణంలోని మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావటంతో ఆలయం భక్తుల కిటకిట లాడింది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



దాచేపల్లిలో రథ సప్తమితో ఊరేగింపు దృశ్యం

దోమల వ్యాప్తి నివారణకు తక్షణ చర్యలు

- జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్

క్రోసూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో అన్నిరకాల వ్యాధుల వ్యాప్తికి దోమలే ప్రధాన కారణమని, దోమలు వ్యాప్తి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లకు జిల్లామలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ ఆదేశించారు. మంగళవారం క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను, దోమలను లార్వా దశలోనే నశింపచేసే విధానాన్ని ప్రజలకు తెలియ జేయాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ ధనుష్ మాట్లాడుతూ ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఒక్కరు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. క్యాన్సర్ అనేది కేవలం చికిత్స ద్వారా గెలవాల్సిన పోరాటం కాదని, దానిని మూలాల నుంచి తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ప్రజల ఆరోగ్యానికి పూర్తిభద్రత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శ్యామ్‌సన్, కమ్యూనిటీ హెల్త్ అధికారి సాంబశివ రావు, సూపర్‌వైజర్ శివుడు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి రవీంద్ర

రాష్ట్రస్థాయి పోటీల్లో
కారంపూడి విద్యార్థుల హవా

కారంపూడి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాల మహోత్సవం క్రీడలు జనవరి 31, ఫిబ్రవరి 1 తేదీల్లో వడ్లమూడి విజ్ఞాన్ కళాశాలలో జరిగాయి. ఈ పోటీల్లో స్థానిక బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు అండర్ - 14, అండర్ - 17 ఖోఖో బాలుర విభాగంలో విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థులను హైస్కూల్లో ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనంతశివ, వ్యాయామ ఉపాధ్యాయులు జే శ్రీనివాసరావు, స్వర్ణరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దుండగులు దహనం చేసిన కంది చేను

కంది చేను దహనం

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కంది చేనును గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేసిన ఘటన మండలంలోని హస్నాబాద్‌తండాలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కేతావత్ రతన్ నాయక్ రెండు ఎకరాల్లో కంది సాగు చేశాడు. పంట చేతికి రావడంతో కోసి కట్టలుగా వేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు కట్టలకు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి పంట మొత్తం దహనమైంది. ఈ ఘటనపై బాధితుడు రతన్‌నాయక్ విజయపురిసౌత్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రూ. లక్ష వరకు పంట నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

బీసీలను అవహేళన చేస్తున్నారు

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మున్సిపల్ చైర్మన్ పదవి బీసీ జనరల్‌కు కేటాయించగా ఓసీ వర్గాలు ఆ పదవిని అనుభవిస్తూ బీసీలను అవహేళన చేస్తున్నారని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుండాల సైదులు అన్నారు. మంగళవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పురపాలక సంఘంలో 16 మంది బీసీ కౌన్సిలర్లు ఉండగా ఐడబ్ల్యూ నెపంతో ఇన్‌చార్జిలమంటూ చైర్మన్ పదవిని అనుభవిస్తూ అభివృద్ధికి మంజూరైన నిధులను దుర్వినియోగంచేస్తున్నారని ఆరోపించారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ వేణుబాబుకు ఫిర్యాదు చేశామన్నారు. వార్డుల్లోని బీసీలను ఐక్యం చేసి ఈనెల 10 న రిలే నిరాహార దీక్ష చేపడతామన్నారు. సైదులు వెంట బహుజన సమాజ్‌పార్టీ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.



కళ్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

వైభవంగా భావనారుషి కళ్యాణం

మాచవరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన మాచవరంలోవున్న భద్రావతి సమేత భావనరుషి కళ్యాణ మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. పుణ్య దంపతులు పీటల మీద కూర్చొని స్వామి వారి కళ్యాణాన్ని నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు కళ్యాణ మహోత్సవంలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కళ్యాణం అనంతరం మహిళలకు లక్కీడిప్ ద్వారా బహుమతులు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పెదకూరపాడు, (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడులోని భావనా రుషి దేవాలయంలో రథ సప్తమిని పురస్కరించుకొని మంగళవారం భద్రావతి సమేత భావనారుషి కళ్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు నుదురుపాటి హనుమంతరావుశర్మ, హరినాథశర్మలు కళ్యాణ మహోత్సవాన్ని జరిపించారు. స్వామివారికి గౌరీపూజ పంచామృతాలతో అభిషేకాలను నిర్వహించారు. మేళ తాళాలతో స్వామి వారి కళ్యాణాన్ని నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

వీరభద్ర స్వామి ఆలయ ఆవరణలో
6న షాపుల హక్కులకు వేలం

క్రోసూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేట మండలం ఓర్వకల్లు గంగమ్మతల్లి తిరునాళ్ళ సందర్భంగా వివిధషాపుల నిర్వహణకు 6వతేది ఉదయం 11 గంటలకు క్రోసూరులోని వీరభద్రస్వామి ఆలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో కోటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హక్కులను దక్కించుకున్న వారు ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు, మార్చి 13 నుంచి 15వ తేదీ వరకు వ్యాపారాలు నిర్వహించు కోవచ్చన్నారు. హిందువులై ఉండి, దేవాదాయ శాఖకు సంబంధించి ఎటువంటి వివాదాల్లో ఉండని వారు రూ.10 వేలు దరావత్తు చెల్లించి వేలంలో పాల్గొన వచ్చునని తెలిపారు. వివరాలకు క్రోసూరులోని దేవాదాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

పొలం పిలుస్తోంది

రాజుపాలెం, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌటపాపాయపాలెం పొలాలలో వ్యవసాయ అధికారి పీ వెంకట నరసయ్య మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు వారి పంట పొలాలకు తగిన మోతాదులోనే రసాయనిక ఎరువులు వాడాలని సూచించారు. వరిపైరులో భాస్వరం ఎరువులను దమ్ములోనే వేయాలని, పైరుపై వేయకూడదన్నారు. నత్రజని కాంప్లెక్స్‌ను ఎరువు, లేదా యూరియా రూపంలోనే వాడాలన్నారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి

దాచేపల్లి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రెంటచింతల నుంచి దాచేపల్లి వైపు ద్విచక్రవాహనంపై వస్తున్న వ్యక్తి మార్గమధ్యంలో దాచేపల్లి మండలం నడికూడి గ్రామ సమీపంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద డివైడర్‌ను ఢీకొని మృతిచెందగా, వెనుక కూర్చున్న మరో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం మధ్యాహ్నం జరిగింది. మృతుడు రెంటచింతల గ్రామానికి చెందిన బాపనపల్లి నాగసురేంద్ర(31)గా గుర్తించారు. గాయాలపాలైన మాదానుసాగర్ రెంటచింతల గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. క్షతగాత్రుడిని నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ పాపారావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



తొండపి చెరువు వద్ద చేపలను పెంచ వద్దంటూ ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన మత్స్య శాఖ అధికారులు

చెరువులో చేపలు పెంచొద్దు

ముప్పాళ్ళ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తొండపి గ్రామంలో సుమారు 180 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో చేపల చెరువు ఉంది. చెరువును సత్తెనపల్లిలోని వడ్డవల్లి ఫిషర్‌మెన్ సొసైటీకి ప్రభుత్వం లీజుకిచ్చింది. సొసైటీ అధ్యక్షుడు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించటం, సభ్యులకు వాటాలు ఇవ్వకుండా సొంతంగావ్యవహరిస్తుండటంతో పాటు చెరువు లీజుకూడా చెల్లించలేదు. దీంతో మంగళవారం విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్ పావని 'చెరువులో చేప పిల్లలను పట్టడం చేయరాదు' అని చెరువు వద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.



స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న ఎస్టీయూ నేతలు

10వ తరగతి విద్యార్థులకు
స్టడీ మెటీరియల్ అందజేత

దుర్గి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడిగొప్పుల, ఓబులేశునిపల్లె జడ్పీ హైస్కూళ్లలో మంగళవారం శ్రీతులసీ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ద్వారా ఎస్టీయూ నేతలు 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జీసీహెచ్ అనంతరామయ్య, హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఇన్‌చార్జి హెచ్‌ఎం టి శ్రీనివాసరావు, వీరేశ్వరరావు, బీమా అప్పారావు, బూసాని శివకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి - పెన్నా అనుసంధాన పథకం
పంపు హౌస్ పనుల పరిశీలన

క్రోసూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : గోదావరి-పెన్నా నదుల అనుసంధాన పథకం పంపు హౌస్ నిర్మాణాల్లో భాగంగా క్రోసూరు మండలంలోని పీసపాడు, ఎర్రబాలెం గ్రామాల మధ్య జరుగుతున్న పనులను మంగళవారం క్రోసూరు తహసీల్దార్ వేముల వెంకటనాగరాజు సందర్శించారు. ప్రకాశం బ్యారేజ్ నుంచి హరిశ్చంద్రాపురం, లింగాపురం పంపు హౌస్‌ల మీదుగా క్రోసూరు మండలంలో నిర్మాణమవుతున్న పంపుహౌస్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ సంస్థ మేఘా ఇంజనీరింగ్ సాంకేతిక నిపుణులు, సిబ్బందితో ఆయన మాట్లాడారు. పనుల్లో పురోగతిని అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ మవుతున్న చెరువును, ప్రాజెక్టుకు ఉపయోగించే పైపుల తయారీ విధానాన్ని పరిశీలించారు. పనులను వేగంగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఆయనతో పాటు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, రెవెన్యూసిబ్బంది ఉన్నారు.



ఇంజనీర్లు, సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్

ద్విచక్ర వాహనాలు ఢీ..

- ఇద్దరికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు

నకరికల్లు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట నుంచి వస్తున్న ఒక ద్విచక్ర వాహనాన్ని, మరొక ద్విచక్రవాహనం వెనుకనుంచి ఢీ కొట్టడంతో జరిగిన ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దేచవరం గ్రామానికి చెందిన కొత్తపల్లి ప్రభాకర్ నరసరావుపేట నుంచి వస్తూ శాంతినగర్ వద్దగల పెట్రోల్‌బంకులో పెట్రోలు కొట్టించుకొనేందుకు మలుపు తిరిగాడు. ఆ సమయంలో వెనుకనే ద్విచక్రవాహనంపై వస్తున్న నాలి శివ అనే వ్యక్తి ముందువెళ్తున్న ప్రభాకర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వీరిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో నరసరావుపేట వెళుతున్న పిడుగురాళ్ళ, దాచేపల్లి సీఐలు వెంకటరావు, భాస్కర్‌లు ప్రమాదాన్ని గమనించి ఆగి గాయపడిన ఇద్దరిని ఒక వాహనంలోకి ఎక్కించి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి వైద్యులకు ఫోన్‌లు చేసి మెరుగైన వైద్య సాయం అందించాలని సూచించారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి

ముప్పాళ్ళ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో రైతులు రీ సర్వేకు సహకరించాలని, తమ పొలాలను అధికారులతో సమగ్రంగా రీ సర్వే చేయించు కోవాలని తహసీల్దార్ ఎం భవానీశంకర్ అన్నారు. మండలంలోని నార్నెపాడులో జరుగుతున్న రీ సర్వేను మంగళవారం తహసీల్దార్ భవానీశంకర్ పరిశీలించారు. రీ సర్వే వల్ల ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీప్రసాదు ఉన్నారు. ఇరుకుపాలెం ఎండీయూవాహనంలో నిత్యవసర సరుకులను పంపిణీ చేస్తున్న విధానాన్ని తహసీల్దార్ ఎం భవానీ శంకర్ పరిశీలించారు.

సీసీ, బీటీ రహదారుల నిర్మాణం

పెదకూరపాడు,ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో రూ.37 కోట్లతో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణ పనులను చేపట్టినట్టు టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్తిమళ్ళ రమేష్ తెలిపారు. రామాపురంలో రూ.8 లక్షలతో నిర్మించిన సీసీ రహ దారి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. మండలంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు.

ఆరోగ్యకర జీవనశైలితో క్యాన్సర్‌కు చెక్

ఫటాఫట్

డాక్టర్ వె.సుజాత,
సత్తెనపల్లి ఏరియా వైద్యశాల
సీనియర్ గైనకాలజిస్టు



సత్తెనపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు ఆరోగ్య కరమైన జీవన శైలిని అనుసరించటం ద్వారా క్యాన్సర్‌ను నివారించ వచ్చని సత్తెనపల్లి ఏరియా వైద్యశాల సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ వై సుజాత తెలిపారు. క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, చికిత్స గురించిన అవగాహనను ప్రజలకు అందించటం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇందుకోసం ప్రదర్శనలు, సెమినార్లు, అవగాహన ర్యాలీలను విస్తృతంగా నిర్వహిస్తోందని తెలిపారు. క్యాన్సర్ వ్యాధి గురించిన సంక్షిప్త సమాచారం ఆంధ్రజ్యోతి ఫటాఫట్ ఇంటర్వ్యూలో..

ప్రశ్న : క్యాన్సర్ ఎలా వ్యాపిస్తుంది?

డాక్టర్ : జీవనశైలిలో మార్పులు, పశ్చాత్య ధోరణి పెరగటం, వ్యాయామం పై నిర్లక్ష్యం, కాలుష్య తీవ్రత, ధూమ పానం, మద్యంతో ప్రాణాంతక క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయి. గర్భాశయం ముఖ ద్వార, రొమ్ము క్యాన్సర్‌తో పాటు నోటి, ఊపిరి తిత్తుల క్యాన్సర్ కేసులు నమోదు అవుతున్నాయి. వీటిని తొలి దశలో గుర్తిస్తే నయం చేయవచ్చు.

ప్రశ్న : క్యాన్సర్‌ను ఎలా నివారించ వచ్చు ?

డాక్టర్ : జీవన శైలిలో మార్పులు ద్వారా 30 నుంచి 40 శాతం క్యాన్సర్లు రాకుండా జాగ్రత్త పడవచ్చు. గతంలో క్యాన్సర్ బారిన పడితే శరీరంలో వ్యాధి సోకిన భాగం తొలగించాల్సి వచ్చేది. ఇప్పుడు మెరుగైన సాంకేతికత చికిత్స విధానాలు అందుబాటులోకి వచ్చాయి. ఫలితంగా చిన్న పాటి శస్త్ర చికిత్సలతో మామూలు స్థితికి తీసుకు రావచ్చు. తొమ్మిది సంవత్సరాలు దాటిన బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నిరోధానికి తోడ్పడే హెచ్‌పీవీ టీకా వేయించాలి. పిల్లలకు పొగాకు, మద్యం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలి.

ప్రశ్న : క్యాన్సర్‌కు చికిత్స ఎక్కడ ఉంది?

డాక్టర్ : గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో క్యాన్సర్‌కు చికిత్స ఉంది. క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చికిత్సలు చేస్తారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీకి అవకాశం ఉంది. అప్రమత్తంగా ఉండటమే క్యాన్సర్ నివారణకు మార్గం. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల్లో సర్వే చేయించటంతో పాటు వ్యాధి లక్షణాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల పై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

సాగర్ కాల్వ ఆధునికీకరణకు నిధులివ్వండి

- మంత్రి రామానాయుడును కోరిన ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ కాల్వలు, బుగ్గవాగు ఆధునీకరణకు నిధులు ఇవ్వాలని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస రావు రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును కోరారు. విజయవాడలోని ఇరిగేషన్ కార్యాలయంలో ఎమ్మెల్యే యరపతినేని మంత్రిని కలిసి గురజాల నియోజకవర్గంలో ఇరిగేషన్ సమస్యలను వివరించి, కాల్వల ఆధునీకరణకు నిధులు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే వెంట నాగార్జున సాగర్ కుడికాలువ కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు వున్నారు.



మంత్రి నిమ్మలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని

అమ్మవారి చక్రపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయకత్వంలో, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సత్తెనపల్లి నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందాలని కాంక్షిస్తూ పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు ఎలినేడి లక్ష్మీతులసీ, పట్టణ తెలుగు యువత మాజీ అధ్యక్షుడు ఎలినేడి శ్రీనివాసరావులు మంగళవారం వారి గృహంలో అమ్మవారి చక్ర పూజ నిర్వహించారు. ఈ పూజలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, మునిసిపల్ మాజీచైర్మన్ ఎలినేడి రామస్వామి, పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు. వేద పండితులు ఎమ్మెల్యే కన్నాను ఆశీర్వదించి అమ్మవారి వస్త్రాన్ని అందజేశారు. అనంతరం పట్టణంలోని 20, 24 వార్డుల్లో నిర్వహించిన భావనారుషి స్వామి కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే కన్నా కూటమి నేతలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పద్మశాలి సేవా సంఘం పెద్దలు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను ఘనంగా సత్కరించారు. అనంతరం స్వామి వారిని పట్టణంలో ఊరేగించారు.



చక్ర పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా

మద్యం షాపు టెండర్ల విషయంలో బెదిరింపులు


గుంటూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రెంటచింతల మండలంలో గౌడ వర్గీయులకు వైన్స్ దుకాణాన్ని కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాలువాయి గ్రామానికి చెందిన బ్రహ్మం గౌడ్ కుల ధ్రువీకరణ పత్రాన్ని పొంది మద్యం షాపుని దక్కించుకోవడం కోసం ఐదు టెండర్లు దాఖలు చేశారు. కుల ధ్రువీకరణ తీసుకొని టెండర్లు వేస్తే ఎలా అంటూ ఓ వైన్స్ నిర్వాహకుడు బ్రహ్మం గౌడ్‌ని బెదిరించినట్లు ఓ ఆడియో ఫైల్ సోషల్ మీడియాలో వైరలైంది. ఈ విషయం రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు సిద్దార్థ గౌడ్ దృష్టికి తీసుకెళ్లడంతో సమస్య జఠిలమైంది. టీడీపీ అంటేనే బీసీల పార్టీ అని, మా విషయాల్లో జోక్యం చేసుకునే హక్కు నీకెక్కడిదంటూ ప్రశ్నించారు. వైన్స్ నిర్వాహకుడు, బ్రహ్మం గౌడ్ మధ్య ఫోన్‌లో మాటల యుద్ధం నడిచింది. మొత్తం మీద గౌడ వర్గీయులకు కేటాయించిన వైన్ దుకాణం వ్యవహారం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది.

ఆటోను ఢీకొట్టిన ట్రాక్టర్


- పాఠశాల బాలికలకు గాయాలు ● ఒకరి చేయికి తీవ్ర గాయం

అచ్చంపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలకు వెళ్ళే ఆటో బోల్తా పడి ఒక విద్యార్థినికి తీవ్ర గాయం కాగా పలువురు విద్యార్థినులకు స్వల్ప గాయాలైన సంఘటన మంగళవారం ఉదయం జరిగింది. తాడువాయి గ్రామం నుంచి ఎనిమిది మంది విద్యార్థినులను ఎక్కించుకున్న ఆటోతాళ్ళచెరువులోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌కు బయలుదేరింది. మార్గమధ్యంలో పంట పొలాల వద్ద మలుపు తిరిగే క్రమంలో ఆటోను ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో ఆటో పక్కనే పంట పొలాల్లో ఆటో పడి పోయింది. ఈ ప్రమాదంలో 3వ తరగతి చదువుతున్న విద్యార్థిని పోపూరి అనన్య చేతికి తీవ్ర గాయం కావటంతో బాలికను సత్తెనపల్లి ఆస్పత్రికి తరలించారు. ఆటోలో ఉన్న గౌతమ్, దీపిక, అక్కి, మిల్కి, హని, దీవెన అనే విద్యార్థినులకు స్వల్ప గాయాలయ్యాయి. వీరందరినీ ప్రాథమిక చికిత్స అనంతరం ఇంటికి పంపించారు. ఈ ప్రమాదంలో విద్యార్థినులు ఎటువంటి ప్రాణాపాయం జరుగక పోవడంతో గ్రామస్థులంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే తాడువాయి నుంచి తాళ్ళచెరువులోని పాఠశాలకు అత్యధిక మంది విద్యార్థులు ఇలా ఆటోలో కిక్కిరిసిగా వెళుతుంటారు.

కాలువలో పడిపోయిన ఆటో







చేతికి గాయమైన విద్యార్థిని అనన్య, స్వల్పంగా గాయపడిన విద్యార్థులు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

కోటప్పకొండకు నరసరావుపేట మునిసిపాలిటీ ప్రభ

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి వారి వార్షికోత్సవ తిరునాళ్ళ మహోత్సవం ఈ నెల 26వ తేదీన శివరాత్రి రోజున అంగరంగ వైభవంగా జరగనుంది. ఈ నేపథ్యంలో నరసరావుపేట చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీ విద్యుత్ ప్రభలు భక్తులు ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపథ్యంలో నరసరావుపేట మునిసిపాలిటీ తరపున ప్రతి సంవత్సరం ప్రభను ఏర్పాటు చేయటం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభ నిర్మాణ పనులను మంగళవారం మునిసిపల్ కమిషనర్, మునిసిపల్ ఇంజనీర్, డీఈఈ, ఏఈ, టీపీవో, మునిసిపల్ సిబ్బంది ప్రారంభించారు.



సీఎంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవిందబాబు తదితరులు

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మంగళవారం సీఎం చంద్రబాబునాయుడును కలిశారు. నరసరావుపేట నియోజకవర్గ సమస్యల గురించి, ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ళ ఏర్పాట్లపై చర్చించారు. ప్రతిష్ఠాత్మకంగా జరిపే కోటప్పకొండకు నిధులను కేటాయించవలసిందిగా కోరారు. ఎమ్మెల్యేతో పాటు డాక్టర్ రవీంద్ర, వేల్పుల సింహాద్రి యాదవ్, కనుమూరి లక్ష్మి తదితరులు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.

మానవత్వం చూపిన పోలీసులు



నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట - పిడుగురాళ్ళ ప్రధాన రహదారిపై నరసరావుపేట మండలం రావిపాడు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతినగర్ పెట్రోల్ బంకు వద్ద చోటుజరిగింది. అటుగా వస్తున్న పిడుగురాళ్ల, దాచేపల్లి సీఐలు వెంకట్రావు, భాస్కర్ క్షతగాత్రులను ప్రైవేటు వాహనంలో నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యశాలకు తరలించిన సీఐలు వెంకట్రావు, భాస్కర్‌లకు క్షతగాత్రుల కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

వీధి కుక్కల దాడిలో 15 పొటేళ్లు మృతి

నూజెండ్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాట్లవారిపాలెంలో సోమవారం రాత్రి వీధి కుక్కల దాడిలో 15 పొటేళ్ల పిల్లలు చనిపోగా పది గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు మోరబోయిన వీరయ్య తెలిపిన వివరాల ప్రకారం అప్పుచేసి 30 పొటేలు పిల్లలను కొనుగోలు చేశానన్నారు. సంఘటనా స్థలాన్ని మండల పశు వైద్యాధికారి శివాజీ పరిశీలించి గాయాలైన జీవాలకు వైద్యం అందించి చనిపోయిన జీవాలకు పోస్టుమార్టం నిర్వహించారు. ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందేలా చూడాలని పశువైద్యాధికారికి విజ్ఞప్తి చేశారు.

మహిళ మృత దేహం లభ్యం

నూజెండ్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లకమ్మ నదిలో సోమవారం గల్లంతైన పశువుల కాపరి బీ మరియమ్మ(40) మృతదేహం మంగళవారం ఉదయం సంఘటనా స్థలంలో బయట పడింది. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని వెలికితీసి వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఐనవోలు ఎస్ఐ కృష్ణారావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఏప్రిల్‌లో జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు

యడ్లపాడు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రానున్న ఏప్రిల్ 4, 5, 6 తేదీల్లో జాతీయ స్థాయి ఆహ్వాన పోటీలు నిర్వహిస్తున్నట్టు పుచ్చలపల్లి సుందరయ్య కళా నిలయం వ్యవస్థాపకుడు, తెలుగు నాటక రంగం పరిషత్ సమ్మేళన వేదిక అధ్యక్షుడు ముత్తవరపు సురేష్‌బాబు తెలిపారు. మంగళవారం పోపూరి రామారావు విజ్ఞాన కేంద్రంలో పోటీ నాటికల ఎంపికల కరపత్రాన్ని ఆవిష్కరించారు.

క్లుప్తంగా...

● నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎన్ కళాశాలలో 6వ తేదీన నేషనల్ వర్క్‌షాప్ జరుగుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్ తెలిపారు. మంగళవారం కళాశాలలో వర్క్‌షాపు బ్రోచర్ ఆవిష్కరించారు.

● నూజెండ్ల: మండలంలోని నూజెండ్ల, ములకలూరు జడ్పీ పాఠశాలల్లోని డీఈవో చంద్రకళ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎం రవిచంద్ర, హెచ్ఎం వీవీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● ఈపూరు: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఆర్ఐ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని దాసుళ్ళపల్లి రెవిన్యూ పరిధిలో భూమిని ఆక్రమించారని స్పందనలో కల్యాణి అనే మహిళా రైతు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై ఆర్ఐ శ్రీనివాసరావు మంగళవారం విచారణ చేశారు.

● బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

● నరసరావుపేట రూరల్: అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రతే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అసంఘటిత రంగ కార్మికుల నమోదు కార్యక్రమం మంగళవారం జరిగింది.

ఉప్పరపాలెం ఎస్సీ కాలనీలో

తాగునీటి కష్టాలు

- వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.13లక్షలు ఖర్చుచేసి పైపులు వేసినా ఫలితం శూన్యం
- పాత పైపుల తవ్వివేతతో మినీ ట్యాంకుకు నిలిచిన నీటి సరఫరా
- దీనిపై ప్రశ్నించిన వారిపై గతంలో కేసులు
- కూటమి ప్రభుత్వం దృష్టిసారించాలని వినతి

ఈపూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వేసవికి ముందే ఆ కాలనీ వాసులు తాగునీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. కొండ నాలుకకు మందువేస్తే ఉన్న నాలుక ఊడిందన్న సామెతలా ఉంది ఆ కాలనీ వాసుల పరిస్థితి. మండలంలోని ఉప్పరపాలెం గ్రామంలోని ఎస్సీ కాలనీ వాసులు గత ఏడాదిగా తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. గ్రామంలో తాగునీటి అవసరాలు తీర్చేందుకు వైసీపీ ప్రభుత్వం గ్రామానికి జలజీవన్ మిషన్ పథకం ద్వారా సుమారు రూ.13లక్షలు మంజూరు చేశారు. ఆ పథకం కింద ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేశారు. ఆ సమయంలో కాలనీలోని సిమెంట్ రోడ్లను, డ్రెయిన్లను పగలగొట్టి పైపులైన్ వేశారు. అవి పూడ్చకుండా అలానే వదిలివేశారు. గతంలో బావి నుంచి పైపుల ద్వారా అక్కడ ఏర్పాటుచేసిన మినీ ట్యాంకులకు నీటిని సరఫరా చేసేవారు. కొత్తపైపు లైను వేయటం కోసం ఆ పైపులను తవ్వివేయటంతో శాశ్వత మినీ ట్యాంకుకు నీరు నిలిచిపోయి వీధి కుళాయిలకు తాగునీటి సరఫరా రాటంలేదు. అంతేకాకుండా చేతిపంపులు మరమ్మతులకు నోచుకోక నీటికోసం ఎస్సీ కాలనీ వాసులు అగచాట్లు పడుతున్నారు. ఎస్సీ కాలనీలో సుమారు నాలుగు వందల మంది జనాభా నివశిస్తున్నారు. కాలనీ వాసులు గ్రామంలోని చేతి పంపుల నుంచి ఫ్లోరైడ్ నీటిని తెచ్చుకుంటున్నారు. కొందరు కొచ్చెర్ల నుంచి ఆటోలలో తీసుకువస్తున్న మినరల్ వాటర్ రూ.20లు చెల్లించి 20లీటర్లు కొనుగోలు చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.



పైపుల కోసం పగలగొట్టి వదిలివేసిన సిమెంట్ రోడ్డు





రక్షిత తాగునీటి పథకం ట్యాంక్, మరమ్మతులకు నోచుకోని చేతిపంపు

రెండు వార్డుల్లో టీడీపీ గెలిచిందని తాగునీరు లేకుండా చేశారు

● జీ సురేష్, ఉప్పరపాలెం



పంచాయతీ ఎన్నికలలో ఎస్సీ కాలనీలోని రెండు వార్డులు టీడీపీ అభ్యర్థులు గెలిచారు. ఆ తరువాత నుంచి కాలనీలో తాగునీటి సమస్యలు మొదలయ్యాయి. కాలనీలో ఉన్న తాగునీటి పథకం మూలపడింది. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఉపయోగంలేకుండా పోయింది. అప్పట్లో సమస్య గురించి వైసీపీ ప్రభుత్వంలోని పెద్దలను అడిగితే కొందరిపై కేసులు కూడా నమోదుచేశారు. ప్రస్తుతం కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. కూటమి ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలి.

ఘనంగా రథ సప్తమి పూజలు



ప్రత్యేక అలంకరణలో విప్పర్ల సూర్యనారాయణ స్వామి



ప్రత్యేక అలంకరణలో నూజండ్ల ఆంజనేయస్వామి

వినుకొండ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాసనగర్‌లోని అలివేలుమంగ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ పురోహితులు యడవల్లి శ్రీనివాసశర్మ, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో స్వామి వారికి వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని పట్టణ పురవీధుల్లో కన్నులపండుగగా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి మహిళా భక్తులు, సేవాదళ భక్తుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం ఆలయ నిర్వాహకులకు భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

● పట్టణంలోని భద్రావతి సమేత శ్రీభావన ఋషి దేవస్థానంలో రథసప్తమి వేడుకల్లో కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు అవ్వారు కోటేశ్వరరావు, ఏడుకొండలు, తులసీరాం, ప్రకాష్, సత్యనారాయణ, ఆంజనేయులు, పరమేశ్వరరావు, వెంకటేశ్వరరావు, కిరణ్ పాల్గొన్నారు.

● నరసరావుపేట అర్బన్: నరసరావుపేట పట్టణంలోని మునిసిపల్ కార్యాలయ ప్రాంగణంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో రథ సప్తమి సందర్భంగా అర్చకులు చతుర్వేదుల భ్రమర కుమార్ శర్మ పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

● రొంపిచర్ల: మండలంలోని విప్పర్లవల్లభేశ్వర స్వామి ఆలయంలో సూర్యనారాయణ స్వామికి అభిషేకాలు జరిగాయి. అర్చకులు చందలూరు పరమేశ్వర రావు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సంతగుడిపాడులోని కల్యాణ వేంకటేశ్వరస్వామి, గోగులపాడులోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో, రొంపిచర్లలోని వరసిద్ది విఘ్నేశ్వరస్వామి ఆలయంలో, వాసవి అమ్మవారి ఆలయంలో పూజలను నిర్వహించారు.

● నూజండ్ల: రథ సప్తమి సందర్భంగా నూజెండ్ల ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రధాన అర్చకుడు క్రోసూరు రామ్మోహనాచార్యులు ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు జరిగాయి.



రథసప్తమి వేడుకల్లో భాగంగా స్వామివారిని వినుకొండ పురవీధుల్లో ఊరేగిస్తున్న భక్తులు

పంటల బీమా కోసం కంపెనీల సంఖ్యను పెంచాలి

● పార్లమెంటులో ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రైతుల పంట బీమాను త్వరితగతిన అందజేయడానికి బీమా కంపెనీల సంఖ్యను పెంచాలని, బీమా పరిధిలోకి మరిన్ని పంటలను చేర్చాలని మంగళవారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను టీడీపీ ఫ్లోర్ లీడర్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు కోరారు. రైతులు పండిస్తున్న సుమారు 200 పంటలకు గాను, కేవలం సుమారు 60 పంటలకే బీమాను వర్తింపజేస్తున్నారని, ఇన్సూరెన్స్ కంపెనీలు కూడా పబ్లిక్ రంగంలో 5, ప్రైవేట్ రంగంలో 15 మాత్రమే ఉన్నాయని అన్నారు. బీమా కంపెనీల సంఖ్యను పెంచడమే కాకుండా అత్యధిక పంటలకు బీమాను వర్తింపజేయాలని, ఫసల్ బీమా పథకాన్ని బ్లాక్ లెవల్ నుంచి గ్రామస్థాయికి విస్తరింపజేసినట్లే రైతు పండించే ప్రతి ఎకరాకూ, ప్రతి పంటకూ బీమా వర్తింపజేసేలా నిర్ణయాలను తీసుకోవాలని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు కోరారు. దీనిపై కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ సమాధానమిస్తూ ఫసల్ బీమా యోజనలో టెక్నాలజీ ఉపయోగిస్తున్నామని, రిమోట్ సెన్సింగ్ డేటా ద్వారా పంటనష్టాన్ని అంచనా, బీమా చెల్లింపులు సులభతరం, మరిన్ని పంటలను ఫసల్ బీమా పరిధిలోకి తెస్తున్నామన్నారు. బీమా కంపెనీలు 20కి చేరాయని, ఇంకా పెరుగుతాయన్నారు. ఫసల్ బీమా యోజనను మరింత మెరుగుపరిచే విషయంలో కేంద్రం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు.



ప్రథమ బహుమతి సాధించిన వేటపాలెం ఎడ్ల జత

కోలాహలంగా ఎడ్ల బండ లాగుడు పోటీలు

నాదెండ్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాదెండ్ల గ్రామ సమీపంలోని నందికుంట విఘ్నేశ్వర స్వామి దేవాలయం వద్ద జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభ రాజసం బండ లాగుడు బల ప్రదర్శన పోటీలు ఆహ్లాదకరంగా సాగుతున్నాయి. ఆరు పండ్ల విభాగంలో వేటపాలెంకు చెందిన అత్తోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరిలకు చెందిన ఎడ్ల జత నాలుగు వేల అడుగులు బండ లాగి ప్రథమస్థానం సాధించాయి. పెనమలూరు మండలం యనమలకుదురుకు చెందిన అనంతనేని శ్రీకావ్య, మధుల ఎడ్లు 3,621 అడుగులు లాగి ద్వితీయ స్థానం, పెదగొట్టిపాడుకు చెందిన గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్ల జత 3,399 అడుగులు లాగి తృతీయ స్థానం సాధించాయి. నాగులపాడు గ్రామానికి చెందిన ఎడ్ల జత 4వ స్థానాన్ని, చల్లగుండ్ల గ్రామానికి చెందిన జత ఐదో స్థానాన్ని, కొల్లావారిపాలెంకు చెందిన ఎడ్ల జత ఆరో స్థానాన్ని, 113 తాళ్ళూరుకు చెందిన ఎడ్ల జాత 7వ స్థానాన్ని, గోగులపాడుకు చెందిన ఎడ్ల జత 8వ స్థానాన్ని బోయనవారిపాలెంకు చెందిన ఎడ్ల జత 9వ స్థానాన్ని, పిట్లవానిపాలెంకు చెందిన ఎడ్ల జత 10వ స్థానాన్ని సాధించాయి. వ్యాఖ్యాతలుగా బీ శ్రీనివాసరావు, తంగెడ హసన్‌లు వ్యవహరించారు.

చౌదరయ్య కళాశాల పునః ప్రారంభం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం మద్దిరాలలో ఉన్న ప్రముఖ విద్యా సంస్థ చౌదరయ్య డిగ్రీ కళాశాల వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభమవుతుందని కళాశాల డైరెక్టర్ పి.శివప్రసాదరావు మంగళవారం తెలిపారు. పాలిటెక్నిక్, డిగ్రీ, వివిధ పీజీ కోర్సులతో కళాశాల ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. ఇందుకు సంబంధించిన సన్నాహక కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపక కమిటీ సభ్యులు పి.వీరనారాయణ, ఎస్ హనుమంతరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో అగ్నిప్రమాదం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కళామందిర్ సెంటర్‌లో మంగళవారం అగ్నిప్రమాదం జరిగింది. శివాలయం ప్రాంతంలో ఉన్న ఒక పూరి గుడిసెకు తొలుత నిప్పంటుకుంది. అనంతరం పక్కనే ఉన్న ఒక భవనంలోని మొదటి అంతస్తుకు మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో రూ.3 లక్షల ఆస్తి నష్టం జరిగింది.

స్టోన్ క్రషర్లలో విజిలెన్స్ తనిఖీలు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బొప్పూడిలో రెండు స్టోన్ క్రషర్లలో విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీలు చేశారు. శ్రీగణేష్ స్టోన్ క్రషర్, శ్రీభాగ్యలక్ష్మి స్టోన్ క్రషర్‌లలో తనిఖీలు నిర్వహించి స్టాక్ రిజిస్టర్‌లో ఉన్న నిల్వలతో సరిపోలేదని గుర్తించారు. తదుపరి చర్యల కోసం మైన్స్ అండ్ జియాలజీ అధికారులకు సమాచారం ఇచ్చారు.

ఎన్‌సీసీతో విద్యార్థులలో క్రమశిక్షణ, దేశభక్తి: జేసీ



ఎన్‌సీసీ విద్యార్థులతో జేసీ సూరజ్ ఘనోరె

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 4: (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందించడంలో ఎన్‌సీసీ కీలకపాత్ర పోషిస్తుందని జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరె తెలిపారు. స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో జూబిలేషన్ 2కే-25లో భాగంగా నిర్వహించిన ఎన్‌సీసీ కాడెట్లు, ఇంటర్ కళాశాలల పోటీలు మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాయింట్ కలెక్టర్ సూరజ్ ఘనోరె పాల్గొన్నారు. ఈ పోటీలలో స్క్వాడ్ డ్రిల్ పోటీలలో నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల ప్రథమస్థానం, బాపట్ల ఎమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల ద్వితీయ స్థానంలో నిలిచాయి. గార్డ్ ఆఫ్ హానర్ పోటీలలో నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల ప్రథమస్థానం, ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల ద్వితీయ స్థానంలో నిలిచాయి. టగ్ ఆఫ్ వార్ బాలుర విభాగంలో నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల ప్రథమ స్థానం, ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల ద్వితీయ స్థానంలో నిలిచాయి. టగ్ ఆఫ్ వార్ బాలికల విభాగంలో వీవీఐటీ గుంటూరు ప్రథమ, ద్వితీయ బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల నిలిచాయి. గ్రూప్ డాన్స్ పోటీలలో ఎన్ఈసీ ప్రథమ, శంకర భారతీపురం హైస్కూలు నరసరావుపేట ద్వితీయ స్థానంలో నిలిచాయి. ఉత్తమ ప్రదర్శన కనబర్చిన క్రీడాకారులను జేసీ, నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు అభినందించారు.

ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌కు సిద్ధంగా ఉండాలి

జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమల కుమారి

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ రైతుల వివరాలను (కేఏపీ) ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ చేసేందుకు క్యాడర్ సిద్ధంగా ఉండాలని పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కే.అమలకుమారి తెలిపారు. నరసరావుపేట పట్టణంలోని ప్రకృతి వ్యవసాయ జిల్లా కార్యాలయంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి సిబ్బందితో సమీక్ష మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో ఆరు సబ్ డివిజన్ లో ఆయా గ్రామాల్లో 2025 ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ చేసేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని తెలియజేశారు. జిల్లా అడిషనల్ డిపిఎం ప్రేమ్ రాజ్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం జరుగుతున్న ప్రతి గ్రామ సమైక్యసంఘం పరిధిలో స్వయం సహాయక సంఘాల ద్వారా ప్రకృతి వనరుల కేంద్రంను ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటివరకు గత సంవత్సరంలో 39,113 ఎకరాలలో 30 రకాల విత్తనాలు వేసి కొంతమేర పశువుల మేతకు, ఇంటి అవసరాలకు ఉపయోగించుకొని మిగిలినది భూమిలో కలిపి ప్రధాన పంట వేయడం జరిగిందని తెలిపారు. ఈ సంవత్సరం ప్రకృతి వ్యవసాయం చేసే ప్రతి రైతును పీజీఎస్ గ్రూపులుగా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమానికి జిల్లా ఎన్ఎఫ్ఏలు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన అధికారులు

రొంపిచర్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజోతి): మండలంలోని కొనకంచివారిపాలెం, గోగులపాడు గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివ కుమారి, ఏడీఏ మస్తానమ్మ మొక్క జొన్న, శనగ పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఏవో శివలలిత, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు కొనసాగిస్తాం

● మునిసిపల్ టీపీఎస్ సుజాత





చిలకలూరిపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మున్సిపాలిటీ పరిధిలో ఆక్రమణలు, అనధికార కట్టడాలు, అనధికార లే అవుట్లపై దృష్టి సారించి నిబంధనల ప్రకారం ముందుకు సాగుతున్నట్లు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ కె సుజాత ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఈ వివరాలు ఇలా ఉన్నాయి.

ప్రశ్న: ఆక్రమణల తొలగింపు ఎంతవరకు వచ్చింది?

జవాబు: ఇప్పటికే 30 శాతం ఆక్రమణలు తొలగించాం. పట్టణమంతా ఆక్రమణల తొలగింపు కొనసాగిస్తాం. తొలగించిన ప్రదేశాలలో హద్దులను సూచించే ఇనుప రాడ్లు ఏర్పాటుచేస్తాం.

ప్రశ్న: అనధికార కట్టడాల విషయంలో తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

జ: అనధికార కట్టడాల వారికి నోటీసులు ఇస్తున్నాము. ఇప్పటికే 22 కట్టడాలకు సంబంధించి కోర్టులో చార్జిషీట్లు దాఖలు చేశాం. మరో 30 చార్జిషీట్లు సిద్ధం చేస్తున్నాం. ఈ కేసు ఒక కొలిక్కి వస్తే మునిసిపాలిటీకి రూ.3 నుంచి 4 కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

ప్రశ్న: అక్రమ లేఔట్ల పరిస్థితి ఏమిటి?

జ: మున్సిపల్ పరిధిలో 16 అక్రమ లే అవుట్లు ఉన్నట్టుగా గుర్తించాం. ఇటీవల 5 అక్రమ లే అవుట్ల వద్దకు వెళ్లి అక్కడ పాతిన రాళ్ళను తొలగించాం. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి అక్రమ లే అవుట్ల వివరాలు తెలిపి, వాటి రిజిస్ట్రేషన్‌లను ఆపాలని సమాచారమిచ్చాం. అక్రమ లే అవుట్‌దారులకు నోటీసులు ఇస్తున్నాం. ఆ ప్రాంతాలలో హెచ్చరిక బోర్డులు కూడా పెడుతున్నాం. ప్రజలు అక్రమ లే అవుట్లలో స్థలాలు కొని ఇబ్బందులు కొనితెచ్చుకోవద్దు.

ప్రశ్న: వందల సంఖ్యలో వెలుస్తున్న ఫ్లెక్సీలపై వైఖరి ఏమిటి?

జ: ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఫ్లెక్సీలు అన్నింటిని తొలగించాం. ఎన్నికలయ్యాక వాటిపై దృష్టి సారిస్తాం. అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయటం, అందుకు తగిన రుసుము చెల్లించకపోవడం నిబంధనలకు వ్యతిరేకం.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● కలెక్టర్ అరుణ్‌బాబు



లబ్ధిదారులకు మూడు చక్రాల బండి అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ

నరసరావుపేట కల్చరల్, ఫిబ్రవరి, 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకుని పిల్లలను ఉన్నత స్థితికి చేర్చాలని చెత్తను సేకరించి జీవనం సాగిస్తున్న వారితో కలెక్టర్ అరుణ్ బాబు సూచించారు. మంగళవారం పట్టణంలోని చంద్రబాబు నాయుడు కాలనీలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో కాలనీలో నివాసం ఉంటున్న ఇద్దరు వేస్ట్ పిక్కర్స్‌కు మూడు చక్రాల బళ్ల కలెక్టర్, ఎస్పీ చేతుల మీదుగా అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించి కేజీ నుంచి పీజీ వరకు ఉచితంగా చదివించుకోవాలన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దళిత బహుజన రిసోర్స్ సెంటర్ వారిని కలెక్టర్, ఎస్పీ కంచి శ్రీనివాసరావు అభినందించారు. కార్యక్రమంలో రిసోర్స్‌సెంటర్ నరసరావుపేట కో ఆర్డినేటర్ తోకల సాంబయ్య, డీఆర్వో మురళి, ఆర్డీవో మధులత, అధికారులు పాల్గొన్నారు.

కోటప్పకొండ తిరునాళ్ళ ఏర్పాట్లను వేగవంతం చేయాలి

● ఎమ్మెల్యే అరవిందబాబు

'ఆంధ్రజ్యోతి'కి స్పందన



కోటప్పకొండ వద్ద పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, కడియాల తాండవకృష్ణ తదితరులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కోటప్పకొండలో జరగనున్న మహాశివరాత్రి ఏర్పాట్లను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ప్రచురితమైన కొండకెళ్లేదెలా? అంటూ వచ్చిన కథనంపై ఆయన స్పందించి తిరునాళ్ల ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. కొండ సమీపంలోని ఎన్ఎస్పీ కాలువ వద్ద ఏర్పాటు చేస్తున్న విగ్రహాల పనులను, కాళింది మడుగులో మరమ్మతు పనులను పర్యవేక్షించారు. ఫిబ్రవరి 10 నుంచి పూర్తిస్థాయిలో పనులు వేగవంతం చేసేలా అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట కడియాల తాండకృష్ణ, హరికృష్ణ, చింతిరాల బాలు తదితరులు ఉన్నారు.

భారీ మెజార్టీతో ఆలపాటిని గెలిపించండి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్తిపాటి పుల్లారావు, పక్కన ఆలపాటి

చిలకలూరిపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరిగే ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం పిలుపునిచ్చారు. పట్టణంలో జరిగిన నియోజకవర్గ పట్టభద్రుల ఆత్మీయ సమావేశంలో కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు దినేష్‌రెడ్డితో కలిసి పుల్లారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలో నియోజకవర్గంలోనే అత్యధిక ఓట్లు ఆలపాటికి పోలయ్యేలా బూత్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు బాధ్యతతో పనిచేయాలని సూచించారు.

ప్రతి ఒక్క ఓటు ముఖ్యమైనదే: ఆలపాటి

ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికలలో ప్రతి ఒక్క ఓటు అవసరం అని పార్టీ నాయకులు, కార్యకర్తలు తన గెలుపునకు కృషి చేయాలని కోరారు. పుల్లారావు పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు పార్టీకి నూతనోత్తేజాన్ని ఇచ్చారని ఆలపాటి చెప్పారు.

ఆలపాటికి కాపునాడు మద్దతు

కాగా ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపునాడు మద్దతు తెలిపింది. ఇందుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ పట్టణ టీడీపీ కార్యాలయంలో జరిగింది. కార్యక్రమంలో అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జ్ దినేష్‌రెడ్డి, జనసేన నేత తోట రాజా రమేష్, బీజేపీ నాయకులు తాడిపర్తి జయరామిరెడ్డి, రాష్ట్ర కాపునాడు జాతీయ అధ్యక్షుడు మల్లెల శివ నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ అంకిరెడ్డి రమేష్ నాయుడు పాల్గొన్నారు.

విద్యుత్ గ్రిడ్లపై రైతులకు అవగాహన కల్పించాలి

నాదెండ్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పొలాల్లో ఉన్న విద్యుత్ లైన్ గ్రిడ్లపై రైతులకు అవగాహన కల్పించాలని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఏఈ సిరిపురపు నాగరాజు కోరారు. కార్పొరేషన్ డీజీఎం రమేష్‌రెడ్డి ఆదేశాల మేరకు నాదెండ్ల తహసీల్దార్ ఏవీ రమణను మంగళవారం కలిసి కరపత్రాలను అందించారు. నాలుగు కేవీ విద్యుత్ లైన్‌ల కింద ఎండిన పత్తి, మిరప, ముళ్ళ కంచలను తగలబెడితే లైన్ ట్రిప్ అవుతుందన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు
విస్తృత ఏర్పాట్లు

- 483 పోలింగ్ కేంద్రాలను ఈసీకి ప్రతిపాదించాం
- ఒక్కో పోలింగ్ బూత్‌కు ఐదుగురు సిబ్బందికి డ్యూటీలు
- సాధారణ ఎన్నికల వలే వెబ్ కాస్టింగ్, సీసీ టీవీ ఏర్పాట్లు
- 'ఆంధ్రజ్యోతి'తో కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఆర్‌వో నాగలక్ష్మి



గుంటూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు సజావుగా జరుగుతున్నాయని రిటర్నింగ్ అధికారి, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తెలిపారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ఏలూరు జిల్లాల్లోని మండలాల్లో ఈ నియోజకవర్గం ఏర్పడింది. ఇప్పటివరకు 3 లక్షల 46 వేల 614 మంది ఓటర్లుగా నమోదయ్యారు. వారిలో 2,06,225 మంది పురుషులు, 1,40,344 మంది మహిళలు, 45 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. వీరంతా ఓటు హక్కు వినియోగించుకునేందుకుగాను 483 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించడం జరిగింది. 416 పోలింగ్ బూత్‌ల ఇదివరకే ఏర్పాటు చేయగా వెయ్యి ఓటర్ల సంఖ్య దాటిన కేంద్రాలకు అనుబంధంగా మరో 67 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘానికి ప్రతిపాదించడం జరిగింది. ఈసీ అనుమతి రాగానే వాటిని కూడా నోటిఫై చేస్తామని చెప్పారు. ఎన్నికల నిర్వహణపై ఆర్‌వో నాగలక్ష్మి మంగళవారం సాయంత్రం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎలక్షన్ నోటిఫికేషన్‌ని ఈ నెల 3వ తేదీన ప్రకటించాం. ఇప్పటివరకు ఒకే ఒక్క నామినేషన్ దాఖలైంది. రెండో రోజైన మంగళవారం నామినేషన్లు దాఖలు కాలేదన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, ఏలూరు జిల్లాకు సంబంధించి నూజివీడు, ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి, కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాలు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాలతో పాటు బాపట్ల జిల్లాలోని వేమూరు, కొల్లూరు, చుండూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, నిజాంపట్నం, నగరం, చెరుకుపల్లి, రేపల్లె, బాపట్ల, పిట్టలవానిపాలెం, కర్లపాలెం మండలాల్లో ఎలక్షన్ కోడ్ అమలులో ఉంటుందని ఆర్‌వో తెలిపారు. ఎన్నికల కోడ్‌ని సాధారణ ఎన్నికల ప్రవర్తన నియమావళి వలే అమలు చేస్తున్నాం. రాజకీయ నాయకుల విగ్రహాలన్నింటికి ముసుగులు వేశాం. బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీల బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించడం జరిగిందన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహణ కోసం జిల్లా స్థాయి అధికారులను నోడల్ అధికారులుగా నియమించి వారికి బాధ్యతలు కేటాయించడం జరిగింది. ఎన్నికలు నిర్వహించే పోలింగ్ స్టేషన్లను పరిశీలించి నివేదిక ఇవ్వాలని నోడల్ అధికారులను ఆదేశించాం. నిబంధనల మేరకు పోలింగ్‌స్టేషన్‌లో అన్ని వసతులు ఏర్పాటు చేయాలని, పోలింగ్ గదులు విశాలంగా వుండి వెలుతురు బాగా వుండేటట్లు చూస్తున్నాం. ఎన్నికలు పేపర్ బ్యాలెట్ ద్వారా జరుగుతున్నందున బ్యాలెట్ బాక్సులను మరమ్మత్తులు చేపట్టి వాటికి బాగా ఆయిలింగ్ చేసి వివరాలు ఇవ్వాల్సిందిగా ఆదేశించామన్నారు. గతంలో వలే గుంటూరు నగరంలోని ఆంధ్ర క్రైస్తవ(ఏసీ) కళాశాలలో పోలింగ్ సామాగ్రి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూం, ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. ఇందుకోసం ఒక ప్రణాళికని రూపొందించామన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ కేంద్రాలకు సామాగ్రి తరలింపు, పోలింగ్ ముగిసిన తర్వాత రిసెప్షన్ సెంటర్‌కు తీసుకొచ్చేందుకు రూట్ మ్యాప్‌లను సిద్ధం చేస్తున్నామన్నారు.

ఒక్కో పోలింగ్ బూత్‌కు ఐదుగురు సిబ్బంది విధులు నిర్వహిస్తారు. వారిలో ఒకరు ప్రిసైడింగ్ అధికారి కాగా, ముగ్గురు ఓపీవోలు, ఒక ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. ఇందుకోసం 2,415 మంది సిబ్బంది అవసరం అవుతారు. వీరికి అదనంగా మరో 25 శాతం రిజర్వు సిబ్బంది అవసరం. ఎన్నికల నిర్వహణలో అనుభవం ఉన్న అధికారులు, సిబ్బందిని నియమిస్తున్నాం. కొద్ది రోజుల్లో ఎన్నికల డ్యూటీల నిర్వహణపై శిక్షణ తరగతులు ఏర్పాటు చేయబోతున్నట్లు పేర్కొన్నారు.

బయో కెమిస్ట్రీ విభాగానికి
రాఘవశర్మ రూ.10 లక్షల విరాళం

● డాక్టర్ మోహనలక్ష్మి రూ.3 లక్షలు



డాక్టర్ సుందరాచారికి చెక్‌ను అందజేస్తున్న బయో కెమిస్ట్రీ వైద్యులు

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాలలో బయో కెమిస్ట్రీ విభాగంలో మెడికల్ పీజీ విద్యార్థులను పరిశోధన రంగంలో ప్రోత్సహించే క్రమంలో అవసరమైన వైద్య పరికరాల కొనుగోలుకు ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పీవీ రాఘవశర్మ రూ.10 లక్షల విరాళం అందజేశారు. ఈ నిధులతో ఈ విభాగానికి అవసరమైన సెమి ఆటోమేటెడ్ హెలీనా ఎలక్ట్రో ఫోరేసిస్, హెర్బా ఎలీజా రీడర్, హెలీనా కొయగ్లోమెట్రి పరికరాలను కొనుగోలు చేశారు. పలు రకాల కేన్సర్ వ్యాధుల నిర్ధారణకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. పలు వైరస్ మార్కర్లను తెలుసుకోవచ్చు. బయోకెమిస్ట్రీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ జె మోహనలక్ష్మి వ్యక్తిగతంగా రూ.3 లక్షలు ఇదే విభాగానికి విరాళం అందజేశారు. దీనితో వైద్య పరికరాలు, రిఫ్రిజిరేటర్, ఏసీ వంటివి కొనుగోలు చేస్తారు. డాక్టర్ రాఘవశర్మ అందజేసిన చెక్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారికి బయో కెమిస్ట్రీ వైద్యులు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో బయో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర్, కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ నవనీత లక్ష్మి, డాక్టర్ మోహనలక్ష్మి, డాక్టర్ భానుకుమార్, డాక్టర్ మరియ కుమారి, డాక్టర్ ఇబ్రహీం పాల్గొన్నారు.

జీఎంసీకి డాక్టర్ లక్ష్మీ రజని రూ.10 లక్షలు..



వైద్య కళాశాలకు చేరిన కుర్చీలు

గుంటూరు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ విద్యార్థులు పరీక్ష హాల్‌లో కూర్చునేందుకు అవసరమైన కుర్చీలు బల్లల కొనుగోలు కోసం ఎన్నారై డాక్టర్ నర్రం నేని లక్ష్మీరజని రూ.10 లక్షల విరాళం అందజేశారు. గుంటూరు వైద్య కళాశాలలో వైద్య విద్యను అభ్యసించిన ఆమె అనంతరం కొంత కాలం ఇంగ్లాండ్‌లో వైద్యురాలిగా పని చేశారు. ఇటీవల స్వస్థలమైన విజయ వాడకు వచ్చారు. గుంటూరు వైద్య కళాశాలలో వైద్య విద్యార్థుల వార్షిక పరీక్షల్లో సౌకర్యవంతంగా కూర్చొని రాసేందుకు ఆధునిక కుర్చీలు, టేబుళ్ల కొనుగోలుకు రూ.10 లక్షల చెక్‌ను ఇటీవల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారికి అందజేశారు. ఈ నగదుతో 330 టేబుళ్లు, కుర్చీలను కొనుగోలు చేశారు. మంగళవారం అవి జీఎంసీకి చేరాయి. వీటిని పరీక్ష హాళ్లల్లో ఏర్పాటు చేయిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

'యూత్ ఫర్ మై భారత్'లో వీవీఐటీ విద్యార్థులు

పెదకాకాని, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): నేషనల్ స్వయం సేవక్ (ఎన్.ఎస్.ఎస్) ఆధ్వర్యంలో అస్సాంలోని అస్సాం అగ్రికల్చరల్ యూనివర్సిటీ నందు జనవరి 21 నుంచి 27 వరకు నిర్వహించిన జాతి సమగ్రతా శిబిరం "యూత్ ఫర్ మై భారత్" నకు వీవీఐటీ కళాశాలకు చెందిన బి.వి. అజయ్ కుమార్, సీహెచ్ జీవన అనే ఇద్దరు విద్యార్థులు హాజరయ్యారని కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మంగళవారం తెలిపారు. యువతను శక్తివంతం చేయడానికి మరియు దేశ నిర్మాణ కార్యకలాపాలలో నిమగ్నం చేయడానికి భారత ప్రభుత్వం ప్రారంభించిన మేరా యువ భారత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ శిబిరానికి దేశ వ్యాప్తంగా 16 రాష్ట్రాల నుంచి 200 మంది ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులను ఎంపిక కాగా, కేవలం వీవీఐటీ కళాశాల నుంచి ఈసీఈ విభాగానికి చెందిన బి.వి. అజయ్ కుమార్, సీఎస్ఈ విభాగానికి చెందిన సీహెచ్ జీవన ఎంపిక కావడం విశేషం అని వివరించారు. కళాశాల ఎన్.ఎస్.ఎస్ బృందం ద్వారా గ్రామాలలో ప్రత్యేక శిబిరాలు, సార్వత్రిక ఎన్నికల సమయంలో ఓటరు అవగాహనా సదస్సులు పలు సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొ న్న తీరును పరిగణలోనికి తీసుకుని ఈ విద్యార్థులు ఎంపిక చేయబడ్డారని ఆయన తెలిపారు. శిబిరంలో విద్యార్థులు సమైక్యతా, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి అంశాలపై చర్చలు, సామూహిక కార్యక్రమాలలో పాల్గొన్నారని తెలిపారు. ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాల నుంచి పాల్గొన్న 10 మంది విద్యార్థులతో కలిసి తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేలా కోలాటం, కూచిపూడి నృత్యం, రంగవల్లు లను ఈ శిబిరంలో ప్రదర్శించారని తెలిపారు. అనంతరం అజయ్ కుమార్. జీవనలను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపాల్ వై. మల్లికార్జున రెడ్డి అకడమిక్ డీన్ కె.గిరిబాబు, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఐ.ఎల్.కె భక్తసింగ్ తదితరులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

నల్లి తెగులుతో తాలుకాయలు

● మార్కెటింగ్ జేడీ ఎదుట రైతుల ఆవేదన

గుంటూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మిర్చికి ఈ ఏడాది కూడా నల్లి తెగులు సోకింది. దీనివలన తాలుకాయలు ఎక్కువ శాతం వస్తున్నాయి. రంగు లేకపోతుండటంతో ధర రావడం లేదని ఆరుగాలం కష్టపడి మిరపకాయలను పండించిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తాలుకాయల వలన మార్కెట్‌యార్డులో తేజ వెరైటీకి ధర క్వింటాల్ రూ. 7 వేల నుంచి రూ. 7,500, సీడ్ వెరైటీలకు రూ. 5 వేల నుంచి రూ. 6 వేలు మాత్రమే వస్తున్నాయని చెప్పారు. మంగళవారం ఉదయం మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత ఆదేశాల మేరకు విజయవాడ రీజియన్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు, ఏడీ(ఎం) బీ రాజబాబు మిర్చియార్డులో విస్తృతంగా పర్యటించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా రైతులు తమ బాధలను వెలిబుచ్చారు. అనంతరం యార్డు పరిపాలన భవనంలో ఉన్నతశ్రేణి కార్యదర్శి చంద్రికతో కలిసి సెక్రెటరీలు, అసిస్టెంట్ సెక్రెటరీలు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు.



మిర్చియార్డులో రైతులతో మాట్లాడుతున్న మార్కెటింగ్ జేడీ కాకుమాను శ్రీనివాసరావు, ఇతర అధికారులు

ఈ సందర్భంగా జేడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మిర్చి యార్డులో రైతులు ఎక్కడా ఇబ్బంది పడరాదన్నారు. ఏ రోజు వచ్చిన రైతులు ఆ రోజు మిర్చిని అమ్మేసుకొని వెళ్లిపోయేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గత ఏడాది వలే యార్డుని బ్లాకులుగా విభజించి సెకటరీలు, సూపర్‌వైజర్లకు డ్యూటీలు వేసి బాధ్యతలు కేటాయించాలని సూచించారు. జిల్లా ఎస్పీని కలిసి ఒక పోలీసు అవుట్‌పోస్టు శాశ్వతంగా మిర్చియార్డులో ఏర్పాటు చేసేలా సహాయం తీసుకోవాల న్నారు. అదనపు సెక్యూరిటీ సిబ్బందిని నియమించుకోవాలన్నారు. యార్డులో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అవసరమైతే అన్ని గేట్లు తెరిచి సరుకుని లోనికి అనుమతించాలని ఆదేశించారు. ఎక్కడా డ్రైనేజీ సమస్య తలెత్తకుండా చూసుకోవా లన్నారు. అలానే మార్కెట్ ఫీజు వసూళ్లను లక్ష్యం మేరకు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ గ్రేడ్‌ల సెక్రటరీలు సుబ్రహ్మణ్యం, ఆంజనేయ సింగ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులకు ఏకరూప దుస్తులు

గుంటూరు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ విద్యార్థులకు ఏకరూప దుస్తులు (యూనిఫారం) ప్రవేశపెట్టాలని వైద్యాధికారులు యోచిస్తున్నారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎంఎన్‌సీ) నిబంధనల ప్రకారం ఫస్ట్ ఎంబీబీఎస్ విద్యార్థులకు ఏకరూప దుస్తులు ధరించాలనే కోడ్ ఉంది. ఇది పెద్దగా అమలు కావడం లేదు. ప్రతి వైద్య విద్యార్థి తప్పనిసరిగా బూట్లు ధరించాలని, ఐడెంటిటి కార్డు ధరించాలని నిబంధనలు ఉన్నా ఇవీ అమలు కావడం లేదు. గుంటూరు వైద్య కళాశాలలో మెడిసిన్‌లో 250 సీట్లు అందుబాట్లో ఉన్నాయి. ఫస్ట్ ఇయర్, సెకండియర్, థర్డ్ ఇయర్, ఇలా ఫైనలియర్ వరకు వెయ్యి మందికిపైగా మెడికోలు ఉన్నారు. వీరికి యూనిఫారం లేకపోవడంతో క్యాంపస్‌లో తిరిగే వీరిలో ఎవరు ఏ ఇయర్ చదువుతున్నారో వైద్య బోధన సిబ్బందికి అర్థం కావడం లేదు. దీంతో ఈ విషయంపై అందిన సూచనలతో ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారీ స్పందించారు. ప్రతి ఇయర్ వైద్య విద్యార్థికి టాప్ (షర్ట్) వరకు లేత రంగులో యూనిఫారం ధరించేలా చర్యలు తీసుకోవాలని ఆయన భావిస్తున్నారు. మంగళవారం కొందరు క్లాస్ లీడర్లను పిలిపించి యూనిఫారంపై వారి అభిప్రాయం అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు మాత్రం యూనిఫారం వద్దని అభిప్రాయం వ్యక్తం చేశారు. దీనిపై వైద్యాధికారులు త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు.

సబ్‌కలెక్టర్ చొరవతో స్వగ్రామానికి


- విశాఖవాసులను ట్రైన్లో నుంచి దింపేసిన టీసీ
- తెనాలి రైల్వేస్టేషన్‌లో బాధిత కుటుంబం పడిగాపులు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వైద్యం చేయించుకునేందుకు ఓ కుటుంబం విశాఖ నుంచి కడపకు వెళ్లగా అక్కడ వారి లగేజ్ పోవడం.. డబ్బులు లేకపోవడంతో టిక్కెట్ లేకుండా రైలు ఎక్కడంతో టీసీ తెనాలిస్టేషన్‌లో దింపేయగా సబ్‌కలెక్టర్ చొరవతో వారు స్వగ్రామానికి వెళ్లారు. ఈ ఉదంతం మంగళవారం తెనాలిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. విశాఖదగ్గర గంపరాయి గ్రామానికి చెందిన కాశయ్య కాళ్లు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో వైకల్యానికి గురయ్యాయి. దీంతో కడపలో చికిత్స నిమిత్తం భార్య పిల్లలతో వెళ్లాడు. ఆస్పత్రిలో వైద్యులను కలిసి వచ్చే క్రమంలో లగేజిని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. దీంతో కట్టుబట్టలతో మిగిలిన ఆ కుటుంబం తిరిగి స్వగ్రామానికి చేరేందుకు డబ్బులు లేకపోవడంతో రైల్వే పోలీసులకు విషయం చెప్పారు. ట్రైన్ ఎక్కి టీసీకి వివరాలు తెలిపితే ఇబ్బంది పెట్టడని చెప్పడంతో కుటుంబసభ్యులతో కాశయ్య ట్రైన్ ఎక్కాడు. రైలు తెనాలి సమీపంలోకి వచ్చేసరికి టిక్కెట్ లేకుండా ప్రయాణానికి టీసీ నిరాకరించారు. విషయం చెప్పి బతిమిలాడినా అంగీకరించకుండా తెనాలి స్టేషన్లో దించేశాడు. అక్కడ దీనంగా కూర్చున్న వారి దుస్థితి గురించి స్థానికులు సబ్‌కలెక్టర్‌కు సమాచారం ఇచ్చారు. స్పందించిన సబ్‌కలెక్టర్ సంజనసిన్హా తక్షణమే వారిని ఆదుకోవాలని తహసీల్దార్ గోపాలకృష్ణను ఆదేశించారు. దీంతో స్టేషన్‌కు వెళ్లి ప్లాట్‌ఫాంపై ఉన్న వారిని సబ్‌కలెక్టర్ కార్యాలయానికి తీసుకువచ్చి వారి ఆకలితీర్చారు. అనంతరం వారు తిరుగు ప్రయాణానికి అవసరమైన ఏర్పాట్లు చేసి మధ్యాహ్నం జన్మభూమి ట్రైన్‌కు టిక్కెట్లు కొనిచ్చి దారిఖర్చులకు కొంత నగదు సమకూర్చి తహసీల్దార్ గోపాలకృష్ణ, సిబ్బందితో వారిని స్టేషన్‌లో ట్రైన్ ఎక్కించారు. దిక్కుతోచని స్థితిలో ఉన్న తమకు అధికారులు చూపిన చొరవకు వారు కృతజ్ఞతలు తెలిపారు. సబ్‌కలెక్టర్, తహసీల్దార్ స్పందించిన తీరును పలువురు అభినందించారు.



తెనాలిలో బాధితులను ట్రైన్ ఎక్కిస్తున్న తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది

జీఎంసీ 1977వ బ్యాచ్ రూ.10 లక్షలు..



డైనింగ్ టేబుల్స్

గుంటూరు వైద్య కళాశాల 1977వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తమ మాతృ విద్యా సంస్థకు రూ.10 లక్షల విరాళం అందజేశారు. ఇటీవల ఈ బ్యా చ్‌కు చెందిన విజయవాడలో ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ కాలేషావలీ ఈ విరాళాన్ని జీఎంసి ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారికి అంద జేశా రు. ఈ నగదుతో వైద్య విద్యార్థులు భోజనాలు చేసేందుకు అవసర మైన డైనింగ్ టేబుళ్లను కొనుగోలు చేశారు. ఒక్కొక్క డైనింగ్ టేబు ల్‌పై ఎనిమిది మంది విద్యార్థులు ఆసీనులైన భోజనం చేయవచ్చు. మొత్తం 35 టేబుళ్ల యూనిట్‌లను కొనుగోలు చేశారు. వీటి ద్వారా 280 మంది విద్యార్థులు ఒకేసారి భోజనం చేయవచ్చు. వచ్చే వారంలో వీటిని వైద్య కళాశాలలో ఏర్పాటు చేస్తారు.

పక్కాగా రోగుల లెక్క

● ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో సమగ్ర వివరాలు



రోగుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న దృశ్యం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రోగులు చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చినప్పుడు వారిని పరీక్షించిన వైద్యులు రోగుల ఓపీ షీట్‌పై వ్యాధి, వైద్య పరీక్షల వివరాలను, వాడాల్సిన మందులను రాసి పంపించే వారు. ఆయా వివరాలు మరెక్కడా నమోదు అయ్యే పరిస్థితి లేదు. అనంతరం మరోమారు ఆ రోగి మరోమారు ఆస్పత్రికి వచ్చిన సందర్భంలో ఆ ఓపీ షీటు లేనట్లయితే గతంలో ఆ రోగి ఆరోగ్య స్థితి గురించిన పూర్తి సమాచారం వైద్యులకు తెలిసే అవకాశం లేదు. దీంతో రోగుల పూర్వ ఆరోగ్య పరిస్థితిని అనుసరించి ప్రస్తుతం వ్యాధికి చికిత్స అందించే అవకాశం వైద్యులకు ఉండటం లేదు. ఈ సమస్యలను పరిష్కరించేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. ఇందులో భాగంగానే ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ యాప్‌ను అభివృద్ధి చేశాయి. ఆ యాప్‌లో రోగులకు అందించే చికిత్స సమగ్ర వివరాలు నమోదు కానున్నాయి.

సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు వచ్చే రోగుల ఆరోగ్య సమగ్ర సమాచారం వివరాలు ఇకపై పక్కాగా ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో నమోదు కానున్నాయి. ఆస్పత్రి సిబ్బంది సమన్వయంతో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ యాప్‌లో రోగి ఆధార్, సెల్‌ఫోన్ నెంబర్ల ఆధారంగా రిజిస్ట్రేషన్ చేస్తారు. అనంతరం ఓపీ షీటులో రోగి పేరు, వయస్సు వంటి వివరాల నమోదుతో పాటు తొమ్మిది అంకలతో నెంబరు ఇస్తారు. ఆ నంబరు ఆధారంగానే ఆయుష్మాన్ భారత్ యాప్‌లో ఆ రోగి ఆరోగ్య స్థితిగతుల వివరాలను నమోదు చేస్తారు. రోగి ఆధార్, లేదా ఆ తొమ్మిది అంకెల నంబరు ఆధారంగా దేశంలో ఏ ఆస్పత్రిలోనైనా ఆ రోగి ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకునే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు అందించే వైద్య సేవలన్నీ ఎన్‌టీఆర్ వైద్య సేవలో నమోదు చేయాలని ఇప్పటికే సంబంధిత ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు అందించే వైద్యం, వార్డుల్లో వారికి అందిస్తున్న చికిత్స వివరాలను ఎన్‌టీఆర్ వైద్య సేవల్లో నమోదు చేస్తే దీని ఆధారంగా నగదు ఇస్తారు. ఇప్పటికే సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ఈ ప్రక్రియ కొన సాగుతుంది. ఇప్పటి వరకు శస్త్ర చికిత్సలు చేసుకున్న రోగుల వివరాలను మాత్రమే నమోదు చేశారు. ఇప్పుడు ఎన్‌టీఆర్ వైద్య సేవలో రోగులకు అందించే వైద్యం వివరాలను నమోదు చేస్తున్నారు.

రోగుల సమాచారం పక్కాగా...



ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందుతున్న రోగుల వివరాలు పక్కాగా ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషనన్‌లో వివరాలు నమోదు చేస్తున్నాం. ఆస్పత్రికి వచ్చే రోగుల సమగ్ర సమాచారం నమోదువుతుంది. దీనివలన రోగులకు మెరుగైన వైద్యం అందుతుంది.

-డాక్టర్ లక్ష్మణరావు,
ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్, సత్తెనపల్లి



విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్‌గా సతీష్



బాధ్యతలు స్వీకరించిన యడ్లపల్లి సతీష్

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వి త్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్‌గా యడ్లపల్లి సతీష్ బాధ్యతలు స్వీకరించారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విత్తన విభాగ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం ఈ పదవిలో నియమించిన విషయం విదితమే. యడ్లపల్లి సతీష్ విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్ పదవిలో ఏడాది పాటు కొనసాగే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు లకు అన్ని విధాలా మేలు జరిగేలా చూస్తానని చెప్పారు. సతీష్‌కు పదవి దక్కటం పట్ల ఆచార్య ఎన్ జీ రంగా యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్లు, ఇతర అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేశారు.